TGTEL/26/A0320

# భారతీయ వెలుగు

జాతీయ తెలుగు దిన పత్రిక




శనివారం ఫిబ్రవరి 28, 2026 | సంపుటి :01 | సంచిక :41 | రంగారెడ్డి | పేజీలు -12 | వెల-1:00

Hyderabad,KarimNagar, Warangal, Khammam, Nalgonda, Mahabub Nagar, Nizamabad, Gadwal, Medak, Vikarabad, Wanaparthy, Siddipet,

## మా పెళ్లి విందుకు రండి

**మోడీ అమిత్‌షాలను ఆహ్వానించిన విరోషా జంట**



2లో..

## జీవిత ఖైదు విధించిన జడ్జికి బెదిరింపులు



ఓ కేసులో జీవితఖైదు విధించినందుకు న్యాయమూర్తిపై ఇద్దరు ఖైదీలు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్ (ఖ్రూ)లోని బిజ్‌నోర్‌లో చోటుచేసుకుంది. 2024లో ఓ వ్యక్తిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన కేసుపై బిజ్‌నోర్ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జస్టిస్ నిజేంద్రకుమార్ గురువారం విచారణ జరిపారు. ఇందులో నిందితులుగా తేలిన జైదీప్, పింటు చౌహాన్ అనే ఇద్దరు వ్యక్తులకు జీవిత ఖైదు విధిస్తున్నట్లు తీర్పు వెలువరించారు. న్యాయమూర్తి ఈ ప్రకటన చేయగానే నిందితులు ఆగ్రహంతో ఊగిపోతూ.. ఆయనపై బెదిరింపులకు దిగారు. మీ ఇల్లు ఎక్కడో తెలుసని.. విడిచిపెట్టేది లేదని అన్నారు. దీంతో జడ్జికి రక్షణ పెంచినట్లు పోలీసులు తెలిపారు.

## ఢిల్లీ మద్యం కేసు..

**కేజ్రీవాల్, కవితకు భారీ ఊరట**



2లో..

# దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి


- కేటాయించిన స్థలంలోనే చెత్త వేసేలా అవగాహన
- హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీకి ప్రత్యేక చర్యలు
- అవసరమైతే కిచన్‌లలో సిసి కెమెరాల ఏర్పాటుతో పరిశీలన
- మున్సిపల్ శాఖపై సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు

శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశంచేశారు. మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్‌లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలని సూచించారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. హోటల్స్‌లోని కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. హోటల్స్‌కి రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలని మార్గనిర్దేశం చేశారు. నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలిని సీఎం రేవంత్‌రెడ్డిసూచన చేశారు.

టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హోటల్స్ లోని కిచెన్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలి తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలన్నారు.



## మంత్రి లోకేష్ ఆత్మీయ విందు



- కర్నూలు, నరసరావుపేట ప్రజాప్రతినిధులకు ఆత్మీయ విందు
- ఉండవల్లిలో కూటమి నేతల కుటుంబాలతో సమ్మేళనం
- నియోజకవర్గాల అభివృద్ధి పనులపై ప్రత్యేక నివేదిక
- మహిళలకు పట్టుచీరలు బహుకరించిన మంత్రి
- ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన డిన్నర్ మీటింగ్

2లో..

## బిఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు అబద్ధం




- జీఐ ఆన్ వీల్స్.. టీజీఎస్ఆర్టీసీ శ్రీకారం
- బస్సులపై జీఐ వారసత్వ ప్రదర్శన
- జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులు
- జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్ , మంత్రి పొన్నం

## రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా..నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే



2లో..

పాలమూరులో గెలిచిన కౌన్సిలర్లకు సన్మానం రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందనన కెటిఆర్

# మద్యం కేసులో 'నిజం' గెలిచింది

# అందరూ నిర్దోషులే!

- ఢిల్లీ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు: 23 మందికి విముక్తి
- సీబీఐ అభియోగాలు అబద్ధం: నిరూపించడంలో దర్యాప్తు సంస్థ విఫలం
- 'సౌత్ గ్రూప్' అంటూ ఎందుకు లేబుల్ చేశారు?: దర్యాప్తు సంస్థలను కోర్టు నిలదీత
- తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలుకు సీబీఐ సిద్ధం
- నా నిజాయితీకి దక్కిన విజయం: కేజ్రీవాల్ భావోద్వేగం
- రెండేళ్ల నరకానికి ముగింపు: కే. కవిత ఆవేదన
- విద్యా వ్యవస్థను అడ్డుకోవడమే లక్ష్యం: మనీశ్ సిసోడియా
- రాజకీయ కక్షసాధింపునకు చెంపదెబ్బ: విపక్షాల విమర్శలు




**న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 27 (సదా మీకోసం) :** దేశవ్యాప్తంగా పెనుదుమారం రేపిన ఢిల్లీ మద్యం విధానం (లిక్కర్ స్కామ్) కేసులో నేడు చారిత్రాత్మక తీర్పు వెలువడింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తెలంగాణ నేత కే. కవిత సహా మొత్తం 23 మందిని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రంలో పేర్కొన్న ఏ ఒక్క ఆరోపణను కూడా ప్రాథమికంగా నిరూపించలేకపోయారని ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు.

2లో..



2లో..

## సుపోషణ్ అభియాన్‌లో ఏపీకి ప్రథమ స్థానం

- సుపోషణ్ అభియాన్‌లో ఏపీకి ప్రథమ స్థానం
- అంగన్వాడీల కృషి వల్లే జాతీయ గుర్తింపు
- సింగిల్ యాప్ అమలుతో హాజరు పెంపు 9 డిమాండ్ల అమలు చేసిన ప్రభుత్వం

# సంపాదకీయం

## భారత్ పరిణత ప్రజాస్వామ్యమేనా?

న్యూఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, అమెరికా--భారత్ వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శనకు తీవ్ర ప్రతిస్పందనలు వెల్లువెత్తాయి. ఆగ్రహం, పరిహాసం, నీతి పాఠాలు... ఆ ఘటన చోటుచేసుకున్న కొద్ది నిమిషాలలోనే సామాజిక మధ్యమాలలో ఈ అసంకల్పిత ప్రతిస్పందనలు వ్యక్తమయ్యాయి. ప్రైమ్ టైమ్ టీవీ షోలలో ఆ నిరసన ప్రదర్శన ఉదంతానికి సంబంధించిన వీడియోను మళ్లీ మళ్లీ చూపారు. యాంకర్ల వ్యాఖ్యలు: కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన 'దారితప్పిన నిరసన', 'నివ్వెరపరిచింది', 'కలవరపరుస్తోంది' ఇంకా, 'దేశ ప్రతిష్ఠను మంటగలిపింది' అని కూడా గట్టిగా అన్నారు.

నిజానిజాలను తరచి చూద్దాం. యువజన కాంగ్రెస్ కార్యకర్తల నిరసనపై విమర్శనాత్మక ప్రతిస్పందనలు పూర్తిగా న్యాయబద్ధమైనవే. ఒక అంతర్జాతీయ సదస్సు సందర్భంగా అటువంటి నిరసన ప్రదర్శన ఒక పేలవమైన రాజకీయ వ్యక్తీకరణ అని నేను భావిస్తున్నాను. ఇంకా సంతకాలు చేయని భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఆ అంతర్జాతీయ ఏఐ సదస్సుకు ఎలాంటి సంబంధం లేదు. అయినా కాంగ్రెస్ కారకర్తలు తమ నిరసనకు అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నారు. మీరు ఆ నిర్ణయంతో ఏకీభవించవచ్చు లేదా ఏకీభవించకపోవచ్చు. ప్రజాస్వామిక చర్చ కచ్చితంగా అటువంటి అభిప్రాయభేదాలపైనే ఆరంభమతుంది. ప్రతి నిరసన వివేకవంతమయింది కాదు. ప్రతి నినాదం ప్రతి ఒక్కరినీ ఒప్పించలేదు. యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన వలే ప్రతి నిరసన కూడా మీడియా దృష్టిని తమపై కేంద్రీకరింప చేసుకునే లక్ష్యంతోనే నిర్వహించడం కద్దు. మీరు ఒక నిరసన ప్రదర్శనను ఏవగించుకోవచ్చు. అయితే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు చట్టబద్ధత లేకుండా చేయడం అంగీకరించాల్సిన విషయం కాదు. శాంతియుతంగా నిరసన తెలిపిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ కాంగ్రెస్ విభాగం అధ్యక్షుడిని బెయిల్ మంజూరుకు ఆమోదయోగ్యంకాని న్యాయ నిబంధనల కింద అరెస్ట్ చేశారు. 'జాతికి వ్యతిరేకంగా 'కుట్ర' చేశారని కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలపై అభియోగాలు మోపారు. ఇది నిరసన ప్రదర్శనలపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఢిల్లీ పోలీసులు గుజరాత్ పోలీసులు పరిపూర్ణత నిచ్చిన నిబంధనలనే అనుసరించి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఎటువంటి బహిరంగ సమావేశాలనైనా అడ్డుకునేందుకై గుజరాత్ పోలీసులు తరచూ నిరంతరాయంగా సెక్షన్ 144ను అమలుపరిచేవారు. పోలీసులు ఆ సెక్షన్‌ను అలా అమలుపరచడం న్యాయ సమ్మతం కాదని, పౌరుల హక్కులపై రాజ్యాంగ విరుద్ధంగా ఆంక్షలు విధించడమేనని గుజరాత్ హైకోర్టు గత ఏడాది ఒక తీర్పులో స్పష్టం చేసింది.ఒక విధంగా మోదీ--షాల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న గుజరాత్ రాజ్యాధికార నమూనా జాతీయ స్థాయికి చేరుకున్నది. ఇప్పుడు దీనిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు (బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలు కూడా) అమలుపరుస్తున్నాయి. తమ రాజకీయ ప్రత్యర్థులకు ఇబ్బందులు సృష్టించేందుకు స్థానిక పోలీసులను నిస్సిగ్గుగా ఉపయోగించుకోవడం సాధారణమైపోయింది. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకనే ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. ఇది ప్రమాదకరమైన ధోరణి. ప్రజా జీవితంలో ప్రజాస్వామిక అవకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు వివాదాస్పద అంశాలపై మాట్లాడకుండా పాలకపక్ష సభ్యులు అడ్డకుంటున్నారు. ప్రజాస్వామిక చర్చకు ఇదెలా దోహదం చేస్తుంది? పార్లమెంటులో చట్టాలపై ఎలాంటి చర్చ లేకుండానే వాటిని ఆమోదింప జేసుకోవడంలో పాలకపక్షం ఆరితేరిపోయింది. అధికారంలో ఉన్నవారికి ఇబ్బంది కలిగించే ప్రశ్నలు సంధించేందుకు ప్రధాన స్రవంతి మీడియా సంకోచిస్తోంది. విశ్వవిద్యాలయాలలో ప్రత్యామ్నాయ అభిప్రాయాలను వ్యక్తం చేసేవారిని 'జాతి--వ్యతిరేకులు'గా ముద్ర వేస్తున్నారు. పౌర సమాజం కూడా అధికారంలో ఉన్నవారిని సవాల్ చేసేందుకు సాహసించలేకపోతోంది. తాము నిర్వహిస్తోన్న ఓ కార్యక్రమంలో ప్రసంగించేందుకు నటుడు నసీరుద్దీన్ షాను ముంబై విశ్వవిద్యాలయం ఆహ్వానించింది. తీరా ప్రసంగించాల్సిన రోజు సమీపిస్తుండగా ఎటువంటి వివరణ ఇవ్వకుండానే ఆ ఆహ్వానాన్ని రద్దు చేసింది. మోదీ సర్కార్‌ను విమర్శిస్తుండడమే నసీరుద్దీన్ షా చేసిన అపరాధం! యూట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు తదితరులు కూడా అధికారంలో ఉన్నవారికి భయపడుతున్నారు. సర్వత్రా భయం రాజ్యమేలుతోంది.ఇబ్బందికరమైన వాస్తవాలనే కాకుండా తప్పుడు విషయాలనూ అతిగా మాట్లాడేందుకు అనుమతించి రక్షణ కల్పించే వ్యవస్థే ప్రజాస్వామ్యం. మనం ఆమోదించే నిరసన ప్రదర్శనల పట్ల ఎలా వ్యవహరిస్తున్నామన్నది కాకుండా మనకు ఆగ్రహం కలిగించే అసంబద్ధ నిరసనలకు ఎలా ప్రతిస్పందిస్తున్నామన్నదే ప్రజాస్వామిక పరిణతికి గీటురాయి. అయితే పాలకుల ప్రవృత్తి ఇందుకు విరుద్ధంగా ఉంటున్నది. బెయిల్‌కు అవకాశంలేని ఆరోపణలనేవి తీవ్ర నేరాలకు పాల్పడినవారిపై మోపడానికి మాత్రమే ఉద్దేశించినవి. అంతేగానీ శాంతియుతంగా భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారిని కట్టడి చేసేందుకు వారిపై అటువంటి ఆరోపణలు మోపకూడదు. అటువంటి చర్య అరెస్టయినవారినే కాకుండా ఇంకా చాలా మందిని ప్రభావితం చేస్తుంది. అందులోని సంకేతం సూక్ష్మమైనదేకానీ శక్తిమంతమైనది: నిరసన తెలిపితే భారీ మూల్యం చెల్లించడం అనివార్యమవుతుంది.భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను అరాచకంగా భావించకూడదు. అలా భావించడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజా సార్వభౌమాధికారం, జవాబుదారీతనం ప్రాతిపదికన నిర్మితమవుతాయి. చర్చలు వాటిని బలోపేతం చేస్తాయి. మరి అసమ్మతి, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ శాంతిభద్రతలకు ముప్పుగా పరిగణించడం ప్రజాస్వామ్య పటిష్ఠతకు ఎలా దోహదం చేస్తుంది? స్వేచ్ఛగా సమావేశమయ్యేందుకు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ప్రజలకు హక్కు ఉండితీరాలి. లోపభూయిష్ఠ నిరసన ప్రదర్శనల వల్ల కాకుండా ప్రజాస్వామిక అవకాశాలు తగ్గిపోవడం వల్లే ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనమవుతాయన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.ఏఐ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శనల వల్ల భారతదేశ గౌరవానికి భంగం కలిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎప్పుడూ ప్రతీకాత్మకతకు రంగస్థలాలుగా ఉండడం పరిపాటి. ప్రజల నిరసన మౌన ప్రదర్శనలు, నిరాహారదీక్షలు తదితర రూపాల్లో వ్యక్తమవుతుంది. నిరసన ప్రదర్శనలు ఒక తీర్చిదిద్దిన పద్ధతిలో జరగవు. అలాగే అవి ఆహ్లాదకరంగా కూడా ఉండవు. నిరసన కార్యక్రమాల స్వభావమే అలా ఉంటుంది. 2004లో మణిపూర్ మహిళలు ఇంఫాల్‌లో అసోం రైఫిల్స్ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన నగ్న ప్రదర్శనను గుర్తుచేసుకోండి. ఆ ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతి పరిచింది. యావద్భారతదేశాన్ని కుదిపివేసింది. మణిపూర్‌లో అణచివేతల క్రూరత్వాన్ని ప్రపంచానికి చాటింది. ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన జాతీయ అవమానంగా పరిగణించడం సబబేనా? భారత గణతంత్ర రాజ్య గౌరవం సమున్నతమైనది, దృఢమైనది. రాజకీయ నిరసన ప్రదర్శనలు ఆ గౌరవానికి ఎటువంటి హాని కలిగించలేవు. ఇది స్పష్టం. ఇంతకూ జాతీయ అవమానం అంటే ఏమిటి? ఎప్పుడు దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది? రాజకీయ నిరసన ప్రదర్శనల వల్ల అయితే కాదు. వ్యవస్థీకృత వైఫల్యాలే జాతి గౌరవాన్ని కించపరుస్తాయి గానీ, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే నిరసన ప్రదర్శనలు కావని సునిశ్చితంగా చెప్పవచ్చు. ప్రభుత్వ యంత్రాంగంలో ఎల్లెడలా అవినీతి ప్రజల జీవితాలను ఎలా ఇబ్బందులపాలు చేస్తుందో మనం చూడడం లేదూ? ఆ అవినీతి దేశానికి ఎలా ప్రతిష్ఠాకరం? రాజ్యాంగ సంస్థలు, వ్యవస్థలు బలహీనపడడం దేశానికి ప్రతిష్ఠాకరమా? వాటికి పూర్తిగా భిన్నమైన ఒక నిరసన ప్రదర్శన దేశ గౌరవాన్ని ఎలా తగ్గించివేస్తుందినిరసనకారుల పట్ల అతిగా ప్రతిస్పందించడం ద్వారా వారి నిరసనలకు ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యాన్ని సంతరింపజేస్తాయి. అరెస్టయిన నిరసనకారులు కూడా తమ నిరసనల లక్ష్యం పొందదగిన ప్రాధాన్యం కంటే ఎక్కువగా ప్రజల దృష్టిని ఆకర్షిస్తారు. సమాజం సానుభూతినీ పొందుతారు. పరిణత ప్రజాస్వామ్యం శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతను విస్మరించదు. అదే సమయంలో పౌర స్వేచ్ఛలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతనూ గుర్తిస్తుంది. ఈ రెండిటి మధ్య ఒక సమతుల్యత ఉండేలా పరిణత ప్రజాస్వామ్యం జాగ్రత్త వహిస్తుంది. నిరసనలను నియంత్రించడం ఒక విషయం అయితే భిన్నాభిప్రాయాన్ని నేరంగా పరిగణించడం మరో విషయం.

# మంత్రి లోకేష్ ఆత్మీయ విందు

మొదటి పేజీ తరువాయి

కర్నూలు, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గాల కూటమి ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులకు ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ విందు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధుల మధ్య బంధం, వారి కుటుంబాల మధ్య కూడా అనుబంధంగా ఏర్పడటానికి ఈ ఆత్మీయ సమ్మేళనం వేదికైంది. ఈ ఆత్మీయ కలయిక ఫ్యామిలీ గెట్ టుగెదర్ ని తలపించింది. నేతల కుటుంబసభ్యులు పరస్పరం పరిచయం చేసుకుని సరదా సంభాషణలతో ఆహ్లాదకర వాతావరణంలో గడిపారు. పొలిటికల్ లైఫ్ నుంచి కాస్త రిలీఫ్ గా ఈ డిన్నర్ మీటింగ్ సాగింది. పిల్లల చదువులు, వారి కెరీర్ గురించి మంత్రి లోకేష్ అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం నేతలు ఇచ్చిన దరఖాస్తులలో పరిష్కారం అయినవి, పరిశీలనలో ఉన్నవి తెలియజేసే నివేదికను నేతలకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళామణులకు మంగళగిరి పట్టుచీరలు బహుకరించారు. విందు ముగిశాక గేటు వరకూ వెళ్లి అందరికీ ఆత్మీయ వీడ్కోలు పలికి సాగనంపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి కర్నూలు, నరసరావుపేట పార్లమెంటు పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి కుటుంబసభ్యులతో హాజరయ్యారు.

# మద్యం కేసులో 'నిజం' గెలిచింది అందరూ నిర్దోషులే!

మొదటి పేజీ తరువాయి

**తీర్పుపై హైకోర్టులో సీబీఐ సవాలుకు సిద్ధం**

తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే కేసు కీలక మలుపు తిరిగింది. రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేయడానికి సిద్ధమవుతోంది. ట్రయల్ కోర్టు సాక్ష్యాధారాలను సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని సీబీఐ భావిస్తోంది. ఈ కేసు న్యాయపోరాటం ఇప్పుడప్పుడే ముగిసేలా లేదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

**'సౌత్ గ్రూప్' అంశంపై కోర్టు ప్రశ్నలు**

విచారణ సందర్భంగా కోర్టు దర్యాప్తు సంస్థల తీరును తీవ్రంగా ప్రశ్నించింది. నిందితులను "సౌత్ గ్రూప్" అని పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. "ఈ కేసులో నిందితులను కేవలం 'సౌత్ గ్రూప్' అని ఎందుకు పిలుస్తున్నారు? మిగతా వారిని 'నార్త్ గ్రూప్' అని ఎందుకు అనలేదు?" అని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఈ రకమైన వర్గీకరణ దర్యాప్తులో పారదర్శకతను ప్రశ్నార్థకం చేస్తోందని కోర్టు అభిప్రాయపడింది.

**న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు**

తీర్పు సందర్భంగా న్యాయమూర్తి జితేంద్ర సింగ్ సీబీఐ దర్యాప్తు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేవలం అంచనాలు, ఊహల ఆధారంగా ఒక క్రిమినల్ కేసును నడపలేము. నిందితులపై మోపిన కుట్ర ఆరోపణలకు సంబంధించి ఎటువంటి ప్రత్యక్ష సాక్ష్యాలను దర్యాప్తు సంస్థ కోర్టు ముందు ఉంచలేదు. దర్యాప్తు సంస్థలు తమ పరిధిని దాటి వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి క్షేమకరం కాదు" అని ఆయన పేర్కొన్నారు.

**అరవింద్ కేజ్రీవాల్ భావోద్వేగం**

తీర్పు అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. "నేను ఏ తప్పూ చేయలేదని నా మనసాక్షికి తెలుసు, ఈరోజు న్యాయస్థానం కూడా అదే నిర్ధారించింది. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక, నా వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు పన్నిన కుట్ర ఇది" అని తెలిపారు.

**కే. కవిత ఆవేదన**

తెలంగాణ నేత కే. కవిత మాట్లాడుతూ కేంద్ర దర్యాప్తు సంస్థల తీరును ఎండగట్టారు. "రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ఒక తల్లిని అని కూడా చూడకుండా నన్ను రెండేళ్ల పాటు నా పిల్లలకు దూరం చేశారు. అబద్ధపు సాక్ష్యాలను సృశించి మాపై బురద చల్లాలని చూశారు" అని ఆమె తెలిపారు.

**మనీశ్ సిసోడియా స్పందన**

మనీశ్ సిసోడియా మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో మార్పులు తెస్తున్న తమను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ కేసును సృశించారని విమర్శించారు. "దర్యాప్తు సంస్థలు వేల పేజీల చార్జ్ షీట్లు దాఖలు చేసినా, కోర్టు ముందు ఒక్కటంటే ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయాయి" అని ఆయన స్పష్టం చేశారు.

**బీజేపీ ఎదురుదాడి**

కోర్టు తీర్పుపై బీజేపీ ప్రతినిధి సుధాంశు త్రివేది స్పందిస్తూ.. ఇది క్లీన్ చిట్ కాదని, నిందితులు సాక్ష్యాలను ధ్వంసం చేయడం వల్లే ఆధారాలు దొరకలేదని ఆరోపించారు. కేవలం సాంకేతిక కారణాలతోనే వారు బయటపడ్డారని, ఈ తీర్పుపై హైకోర్టులో అప్పీలు చేస్తామని తెలిపారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా..నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్ పైనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లకు తెలంగాణ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు. కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, ఫ్లలె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు.ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఆలయాన్ని సందర్శించిన మంత్రి.. ఆలయ పరిసరాలను పరిశీలించి శుభ్రత, నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మా పెళ్లి విందుకు రండి

మొదటి పేజీ తరువాయి

గురువారం పెళ్లి చేసుకున్న హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న రిసెప్షన్ ఏర్పాట్లలో ఉన్నారు. గురువారం ఉదయం 10.10 గంటలకు మూడు ముళ్ల బంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్‌లో వీరి పెళ్లి జరిగింది. ఉదయం తెలుగు సంప్రదాయం ప్రకారం.. సాయంత్రం కొడవ సంప్రదాయం ప్రకారం పెళ్లి జరిగింది. ఈ పెళ్లికి అతి కొద్ది మంది బంధుమిత్రులను మాత్రమే ఆహ్వానించారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో చాలా గ్రాండ్‌గా రిసెప్షన్ నిర్వహించనున్నారు. రిసెప్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. విజయ్, రష్మికలు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న రిసెప్షన్‌కు రావాలని ప్రధానికి ప్రత్యేక ఆహ్వానం అందించారు. అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిశారు. పెళ్లి రిసెప్షన్‌కు రావాలని అహ్వానించారు. ఈ సందర్భంగా ఇన్విటేషన్‌తో పాటు వినాయకుడి విగ్రహాన్ని కూడా ఆయనకు అందించారు. విజయ్, రష్మికల జంట ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# దిల్లీ మద్యం కేసు..

## కేజ్రీవాల్, కవితకు భారీ ఊరట

మొదటి పేజీ తరువాయి

మద్యం కుంభకోణం కేసు (ఐవక్ఠీప్రఱ వఞఎఱంవ జూశీశ్రీఱషఎ ఝంవ)లో దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ (ూతీఙఱఅఎ ఖవయతీఱఝశ్రీ), మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత (ఝఙఱ్ఖ)కు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది.ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయస్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సీబీఐ అధికారులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది.

కేసు ఏమిటంటే?

దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ ఎంపీ కవిత (ఝఙఱ్ఖ)లను అధికారులు అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

# సుపోషణ్ అభియాన్‌లో ఏపీకి ప్రథమ స్థానం

మొదటి పేజీ తరువాయి

**జీతాల పెంపుతో అంగన్వాడీలకు లబ్ధి**

**సమస్యలు పరిష్కరిస్తాం, ఆందోళన విరమించండి**




దేశవ్యాప్తంగా నిర్వహించిన సుపోషణ్ అభియాన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని, రాష్ట్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సరికొత్త రికార్డులను సృష్టిస్తోందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రకటించారు. ఈ విజయం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల కృషి వల్లే సాధ్యమైందని ఆమె కొనియాడారు. రాష్ట్రంలోని 76 గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా అత్యధిక అవార్డులు సాధించగా, ప్రతి పంచాయతీకి రూ.1 లక్ష నగదు బహుమతి అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో 70 శాతం ఉన్న పిల్లల హాజరు, ప్రస్తుత ప్రభుత్వ కృషితో 96 శాతం కి చేరిందని మంత్రి తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తలు కోరిన 9 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 55,745 అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, సూపర్వైజర్లకు రూ.75 కోట్లతో 5జీ మొబైల్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామని, సింగిల్ యాప్ విధానాన్ని అమలులోకి తీసుకురావడం జరిగిందని మంత్రి వివరించారు. రిటైర్మెంట్ గ్రాట్యుటీని పెంచినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆందోళన చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆందోళన విరమించాలని, అంతా మంచే జరుగుతుందని మంత్రి భరోసా ఇచ్చారు.

# బిఆర్ఎస్ నేతలపై తప్పడు కేసులు అబద్దం

దేశంలోనే తొలిసారిగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ వద్ద తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , టీజీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ / మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి పాల్గొన్నారు.సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసుకోవడం అవసరమని తెలిపారు. సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపమని, సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచుతాయని, కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం గవర్నర్ గారి దూరదృష్టి ఫలితమని తెలిపారు. జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్ మరియు విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని చెప్పారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పోచంపల్లి ఇక్కత్ వరంగల్ , వరంగల్ తివాచీలు (కార్పెట్లు), కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి తెలంగాణకు చెందిన ఆరు ప్రముఖ జీఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్టించారు. ఈ కళారూపాలు తెలంగాణ కళాకారుల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తూ, ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం

# తెలంగాణ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ఏప్రిల్ 30 పొడిగింపు

**హైదరాబాద్ ఫిబ్రవరి 27(భారతీయ వెలుగు):** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్ కార్డుల నిబంధనల మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని పేర్కొంది.

ఈ పిటిషన్‌లో, జీఓ 252, సవరించిన జీఓ 103 వల్ల జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా




స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు




చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అలాగే, జీఓ 252, సవరించిన జీఓ 103 పై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తి స్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది.

# పాక్-ఆఫ్ఘన్ సరిహద్దుల్లో యుద్ధ మేఘాలు..

- » **55 మంది పాక్ సైనికుల మృతి!**
- » **పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య భగ్గుమన్న సరిహద్దు వివాదం**
- » **ఆఫ్ఘన్‌పై పాక్ వైమానిక దాడులు..**
- » **'ఆపరేషన్ గజాబ్-లిల్-హక్' ప్రారంభం**
- » **70 మంది ఉగ్రవాదులను హతమార్చామని ప్రకటించిన పాకిస్థాన్**
- » **ఇరు దేశాలు సంయమనం పాటించాలి**
- » **ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి**

**భారతీయ వెలుగు న్యూఢిల్లీ ప్రతినిధి**
దశాబ్దాలుగా ఉన్న పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు వివాదం తీవ్రరూపం దాల్చి యుద్ధానికి దారితీసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. తాలిబన్లు జరిపిన దాడులకు ప్రతీకారంగా పాకిస్థాన్ వైమానిక దళం ఆఫ్ఘన్ నగరాలపై బాంబుల వర్షం కురిపించడంతో యుద్ధ వాతావరణం నెలకొంది.



తమ భూభాగంపై తాలిబన్లు జరిపిన కాల్పులకు బదులుగా పాకిస్థాన్ 'ఆపరేషన్ గజాబ్-లిల్-హక్'ను ప్రారంభించింది. పాక్ యుద్ధ విమానాలు కాబూల్, కాందహార్, పక్తియా నగరాల్లోని తాలిబన్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపాయి. ఈ దాడుల్లో 70 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారని, భారీగా ఆయుధ సంపత్తి ధ్వంసమైందని పాక్ రక్షణ శాఖ వెల్లడించింది.

మరోవైపు, తాలిబన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సంచలన ప్రకటన చేశారు. తమ ఎదురుదాడిలో 55 మంది పాకిస్థాన్ సైనికులను హతమయ్యారని, సరిహద్దులోని 19 పాక్ పోస్టులను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. కొంతమంది పాక్ సైనికులను బందీలుగా పట్టుకున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెట్టారు. అయితే, తాలిబన్ల వాదనను పాకిస్థాన్ ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు.

తాజా సమాచారం ప్రకారం సరిహద్దులోని టోర్ఖమ్ గేట్ వద్ద ఇరు వర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. "మా సహనం నశించింది, ఇక యుద్ధమే" అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్రంగా స్పందించారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేస్తుండగా, సరిహద్దు గ్రామాల్లోని వేలాది మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు.

# తిరుమలలో ఇకపై డిజిటల్ మొక్కులు

- » **టీటీడీ కీలక ప్రతిపాదనలు..**
- » **హుండీలో నాణేలకు బదులు '**
- » **ముడుపు పత్రాల' విధానంపై టీటీడీ దృష్టి**
- » **డిజిటల్ చెల్లింపులతో పత్రాలు పొంది హుండీలో వేసేలా కొత్త ఏర్పాటు**
- » **అన్నప్రసాద వితరణకు చిన్న మొత్తాల్లో విరాళాలు స్వీకరించే ప్రతిపాదన**
- » **లడ్డూ కౌంటర్లలో ప్లాస్టిక్‌కు బదులుగా**
- » **జూట్ బ్యాగుల వినియోగం**
- » **నేటి టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ అంశాలపై నిర్ణయం తీసుకునే అవకాశం**

**భారతీయ వెలుగు తిరుపతి ప్రతినిధి**
తిరుమల శ్రీవారికి భక్తులు సమర్పించే కానుకల విషయంలో టీటీడీ పలు కీలక మార్పులకు శ్రీకారం చుట్టనుంది. హుండీలో వేసే నాణేలకు బదులుగా 'ముడుపు పత్రాల' విధానాన్ని ప్రవేశపెట్టడం, అన్నదాన విరాళాలను సామాన్య భక్తులకు సైతం అందుబాటులోకి తేవడం వంటి ముఖ్యమైన ప్రతిపాదనలపై దృష్టి సారించింది. ఇవాళ జరగనున్న టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



ప్రస్తుతం భక్తులు తమ మొక్కుల్లో భాగంగా శ్రీవారి హుండీలో పెద్ద ఎత్తున నాణేలు, నగదు వేస్తున్నారు. దీనివల్ల భక్తులకు, లెక్కింపు సిబ్బందికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు టీటీడీ 'ముడుపు పత్రాల' విధానాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. ఈ విధానం ప్రకారం తిరుపతి, తిరుమలలోని ప్రత్యేక కౌంటర్ల వద్ద భక్తులు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి డిజిటల్ మాధ్యమాల ద్వారా లేదా నేరుగా డబ్బు చెల్లించి, అందుకు సమానమైన విలువ గల ముడుపు పత్రాలను పొందవచ్చు. రూ.100 నుంచి రూ.లక్ష వరకు ఈ పత్రాలను కొనుగోలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భక్తులు ఈ పత్రాలను నేరుగా శ్రీవారి హుండీలో వేయడం ద్వారా తమ మొక్కు చెల్లించుకున్నామన్న సంతృప్తిని పొందవచ్చు. డబ్బు నేరుగా టీటీడీ ఖాతాకు జమ అవుతుంది కాబట్టి, నగదు నిర్వహణ భారం తగ్గుతుంది.

అలాగే శ్రీవారి అన్నప్రసాద వితరణలో ఎక్కువ మంది భక్తులను భాగస్వాములను చేసేందుకు టీటీడీ మరో కీలక ఆలోచన చేస్తోంది. ప్రస్తుతం ఒకరోజు అన్నదానానికి అయ్యే పూర్తి ఖర్చు రూ.44 లక్షలుగా ఉంది. ఇంత పెద్ద మొత్తాన్ని అందరు దాతలు విరాళంగా ఇవ్వలేరు. ఈ నేపథ్యంలో తక్కువ మొత్తంలో విరాళాలు ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని టీటీడీ భావిస్తోంది. పది మంది లేదా వంద మంది భక్తులకు అన్నదానం చేసేందుకు సరిపడా విరాళం ఇచ్చే అవకాశాన్ని కల్పించడం ద్వారా సామాన్య భక్తులు కూడా ఈ పుణ్యకార్యంలో పాలుపంచుకోవచ్చు.

ఈ రెండు ప్రధాన అంశాలతో పాటు పర్యావరణ పరిరక్షణ దిశగా మరో అడుగు వేస్తూ, తిరుమలలోని లడ్డూ కౌంటర్లలో ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జనపనార (జూట్) బ్యాగులను అందుబాటులోకి తీసుకురావాలనే ప్రతిపాదన కూడా పాలకమండలి సమావేశంలో చర్చకు రానుంది. ఈ నూతన విధానాల ద్వారా భక్తులకు సౌకర్యాన్ని పెంచడంతో పాటు దేవస్థానం కార్యకలాపాలను ఆధునికీకరించాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకుంది.

# రాజ్యసభ రేసు అభిషేక్ మను సింఘ్వి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్లు పరిశీలిస్తున్న అధిష్ఠానం.

- » **తెలంగాణలో రెండో సీటుపై కాంగ్రెస్ ఉత్కంఠ**
- » **రాజ్యసభ ఎన్నికలపై కాంగ్రెస్ ప్రత్యేక కసరత్తు**
- » **సామాజిక సమీకరణాల కన్నా 'ఫైర్‌పవర్' ఉన్న నేతలకే ప్రాధాన్యం**
- » **పలు రాష్ట్రాల్లో సీట్ల కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్న ఆశావహులు**
- » **అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానందే తుది నిర్ణయం**

**భారతీయ వెలుగు న్యూఢిల్లీ**
పది రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు గెలుచుకోవడం ఖాయంగా కనిపిస్తుండగా, కాంగ్రెస్ పార్టీకి కేవలం ఐదు సీట్లు దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, పరిమిత సంఖ్యలో ఉన్న స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈసారి సామాజిక సమీకరణాల కంటే, ప్రభుత్వానికి గట్టిగా గళం వినిపించే 'ఫైర్‌పవర్' ఉన్న నేతలకే పెద్దపీట వేయాలని పార్టీ



అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

తెలంగాణలో కాంగ్రెస్‌కు రెండు సీట్లు దక్కే అవకాశం ఉండటంతో ఇక్కడ పోటీ ఆసక్తికరంగా మారింది. ఒక రాజ్యసభ స్థానం గెలవాలంటే 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్‌కు 66 మంది సొంత ఎమ్మెల్యేలతో పాటు, ఒక లెఫ్ట్, ఏడుగురు ఎంఐఎం ఎమ్మెల్యేల మద్దతుతో బలం 74కు చేరింది. దీంతో ఒక సీటు సులభంగా గెలుచుకోనుంది. అయితే, రెండో సీటు కోసం బీఆర్ఎస్‌తో గట్టి పోటీ తప్పకపోవచ్చు. బీఆర్ఎస్‌కు 36 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 8 మంది ఉన్నారు. ఇక్కడి నుంచి సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఒక స్థానం కోసం టీఎస్ సింగ్ డియో, మోహన్ మార్కం వంటి దాదాపు 20 మంది నేతలు పోటీ పడుతున్నారు. హరియాణాలో కూడా ఒకే సీటు ఉండటంతో రాజ్ బబ్బర్, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనతే వంటి వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు సీనియర్ నేత ఆనంద్ శర్మ వైపు మొగ్గు చూపుతుండగా, మాజీ సీఎం వీరభద్ర సింగ్ భార్య ప్రతిభా సింగ్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు.

అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానానిదే. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చర్చించి ఈ వారాంతంలోగా అభ్యర్థుల జాబితాను ఖరారు చేసే అవకాశం ఉంది. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

# 12వ రోజుకు చేరుకున్న ఎపి అసెంబ్లీ సమావేశాలు

- **- వాట్సాప్ ద్వారా 943 రకాల సేవలు అందిస్తున్నాం**
- **- యూనివర్సిటీలను భ్రష్టు పట్టించిన గత ప్రభుత్వ**
- **- ప్రశ్నోత్తరాల సమయంలో సభలో లోకేశ్ వెల్లడి**

ఏపీ అసెంబ్లీ సమావేశాలు 12వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం ప్రశ్నోత్తరాలతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభ కార్యకలాపాలను ప్రారంభించారు. ప్రస్తుతం 943 రకాల సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇప్పటి వరకు కోటి 40 లక్షల మంది ప్రజలు ఈ సేవలను పొందారని వివరించారుఏపీ శాసనసభలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. . వాట్సాప్ గవర్నెన్స్‌కు కృత్రిమ మేధస్సును జోడించి యూజర్ ఫ్రెండ్లీగా మార్చామని చెప్పారు. ఉన్న సౌకర్యాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునేలా చేశామని తెలిపారు. ఈ వ్యవస్థను మరింత ఆధునీకరించాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. వేగంగా స్పందించడం, రసీదులు తక్షణమే అందించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. సభ్యులు క్షేత్రస్థాయి పరిస్థితులపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలన్నారు. మనమిత్ర 2.0ను త్వరలో ప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి లోకేశ్ సభలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆంధ్రా విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో రోజువారీ వేతనాలు, ఎన్ఎంఆర్ ఉద్యోగుల వేతనాలపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రశ్నలేవనెత్తారు. వైసీపీ హయాంలో ఉద్యోగుల కేటగిరి మారుస్తామని చెప్పి మోసం చేశారని తెలిపారు. చిన్నస్థాయి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సభలో కోరారు. మరో ఎమ్మెల్యే వంశీ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఆంధ్రా యూనివర్సిటీని అప్పటి వీసీ ప్రసాద్ రెడ్డి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మార్చారని, యూనివర్సిటీని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధానం ఇస్తూ.. వైసీపీ హయాంలో ఆంధ్రా విశ్వవిద్యాలయం దేశ స్థాయి ర్యాంకింగ్స్‌లో 72వ స్థానానికి పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టాప్ 10 స్థాయికి తీసుకొచ్చామని చెప్పారు. యూనివర్సిటీ వందేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# లిక్కర్ కేసులో కవితకు క్లీన్ చిట్

**భారతీయ వెలుగు హైదరాబాద్ ప్రతినిధి**



కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ నమోదు చేసిన అభియోగాలను రౌస్ అవెన్యూ కోర్టు కొట్టేసింది. ఈ కేసులో కవిత ప్రమేయం లేదని ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చింది. కవితతో పాటు కేసులో నిందితులుగా ఉన్న 23 మంది తప్పు చేశారన్న సాక్ష్యాధారాలు లేవని సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జీ జితేందర్ సింగ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీ సన్నాహాల్లో ఉన్న కవితకు ఈ తీర్పు పెద్ద ఊరట.

# ఏపీ హైకోర్టుకు కొత్త సీజే



హైకోర్టు సీజేల నియామకంపై సుప్రీంకోర్టు కొలీజియం కీలక నిర్ణయం తీసుకుంది. పదవీ విరమణకు 2 నెలల ముందే కొత్త సీజేలను నియమించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఏపీ, మద్రాస్ హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను కొలీజియం సిఫారసు చేసింది. ఏపీ హైకోర్టు తదుపరి సీజేగా జస్టిస్ లీసా గిల్, మద్రాస్ హైకోర్టు సీజేగా జస్టిస్ సుశ్రుత్ అరవింద్ పేర్లు ప్రతిపాదించింది.

# రబ్బీ వరీ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేపట్టండి

» జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి

**భారతీయ వెలుగు:చీఫ్ బ్యూరో/వికారాబాద్, ఫిబ్రవరి:27,**



రబ్బీ సీజన్ పండిన వరి ధాన్య సేకరణకు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేటులోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో రబ్బీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం సేకరణకై సంబంధిత అధికారులతో కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రబ్బీ 2025 -26 వరి ధాన్య సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలోని 129 వరి ధాన్యం సేకరణ కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకై చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ప్రతి వరి ధాన్యం సేకరణ కేంద్రాల్లో తూనికల సామాగ్రి, టార్పాలిన్లు, సంచులతో పాటుగా తేమ యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. సేకరించిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం, జిల్లా సహకార అధికారి నాగార్జున, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం బిజెపి కట్టుబడి పని చేస్తుంది... వడ్డేపల్లి రాజేశ్వరరావు



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. అఖిలభారత ఆరెకటిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అత్తికారి మల్లేశ్ ఇటీవల బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సమక్షంలో పార్టీలో చేరిన శుభ సందర్భంగా శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మల్లేశ్ ఆయన మిత్ర బృందాన్ని పార్టీలోకి హృదయపూర్వకంగా స్వాగతించి సమాజ సేవకు రాష్ట్రాభివృద్ధికి బీజేపీ వేదికగా మరింత విస్తృతంగా సేవ చేసే అవకాశాన్ని అందిపుచ్చుకున్నందుకు అభినందించారు. మంచి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా వారిని ప్రశంసించారు. దేశ అభివృద్ధి, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించడమే పార్టీ లక్ష్యమని, మల్లేశ్ చేరికతో పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, బాలనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రమేష్, బిజెపి సీనియర్ నాయకులు శివరంజని, రూప, అర్జున్, సురేందర్, బోయిరాజులు, కుమార్, బాలస్వామి, రాము, అనిల్, వినోద్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కవితక్కకు ఢిల్లీ లిక్కర్స్ క్యాంప్ కేసులో క్లీన్ రావడం సంతోషంగా ఉంది: రాకేష్ గైక్వాడ్



**భారతీయ వెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 27:**
ఢిల్లీ లిక్కర్ కేసులో క్లీన్ చీట్ రావడం సంతోషంగా ఉందని హరి బోలీ డివిజన్ తెలంగాణ జాగృతి యువ నాయకులు రాకేష్ గైక్వాడ్ అన్నారు. న్యాయవ్యవస్థపై నమ్మకం పెట్టుకున్న నమ్మకమే గెలిపించిందని, కడిగిన ముత్యంలా బయటికి వస్తానని కవితక్క చెప్పిన విధంగానే క్లీన్ చీట్ రావడం ఎంతో సంతోషంగా ఉందని రాజకీయ కక్ష సాధింపులతో కేసులు పెట్టారని గతంలో పదేపదే కవితక్క తెలిపిన ఎంతోమంది విమర్శలు చేసిన పట్టించుకోలేదని, ఐదున్నర నెలలు జైల్లో పెట్టిన కుటుంబానికి దూరం చేసిన, తెలంగాణ ప్రజలకై పట్టు విడవకుండా ప్రజల పక్షాన నిలబడుతూ ప్రజా గొంతుకై ప్రశ్నిస్తున్న కవితక్కకు తెలంగాణ జనం నీరాజనం పడుతున్నారని, కవితక్కను విమర్శించిన నోర్లు ఇప్పుడు మూతపడతాయని ఈ సందర్భంగా రాకేష్ గైక్వాడ్ అన్నారు. కవితకు క్లీన్ చిట్ రావడంతో తెలంగాణ జాగృతి ఆఫీస్ వద్ద బాణా బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టి, రంగులు చల్లుకొని కవితక్క జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, నవీన్ కుమార్, హర్ష, ఓంకార్, శ్రీకర్ రాజు, బబ్లు, నితిన్, భాను, సతీష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ సిల్వర్ మెడల్ సాధించిన యువతిని అభినందించిన బిజెపి శ్రేణులు...



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
భారతీయ జనతా పార్టీ బాలనగర్ డివిజన్ మైనారిటీ మహిళా నాయకురాలు సమీనా బేగం కూతురు పదవ తరగతి చదువుతున్న అయూష బేగం బాక్సింగ్ పోటీలో ఒకటి సిల్వర్, రెండు గోల్డ్ మెడల్స్ లను అతి తక్కువ సమయంలో సాధించిన సందర్భంగ కూకట్పల్లి బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావుని వెళ్లి మర్యాదపూర్వకంగా కూకట్పల్లి బిజెపి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కాంతారావు శాలువాతో సన్మానించి కేంద్ర ప్రభుత్వం ద్వారా స్పోర్ట్స్ కు సంబంధించి సహాయము కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తామని మాట ఇచ్చారు. మా నినాదం సబ్కా సాత్, సబ్కా వికాస్, అందరూ సమానమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాశరావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సురేందర్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు జి ఆర్ రమేష్ , మాజీ మహిళా అధ్యక్షురాలు శివరంజని, డివిజన్ జనరల్ సెక్రెటరీ మధు, ప్రదీప్ రెడ్డి, సంధ్య, రూప తదితర నాయకులు, నాయకురాలు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో బంగారు రజిత పథకాలు సాధించడం అభినందనీయం... వడ్డేపల్లి

**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



జిల్లాస్థాయిలో బాలనగర్కు చెందిన ఆయేషా బంగారు రజిత పథకాలు సాధించడం అభినందనీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. బాలనగర్ డివిజన్‌కు చెందిన ఆయేషా ఇటీవల మహబూబ్ నగర్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని స్వర్ణ, రజత పతకాలు సాధించి విజేతగా నిలిచింది.
తన భవిష్యత్ క్రీడా ప్రస్థానానికి సహాయసహకారాలు అందిస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని శుక్రవారం ఆమె మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.
ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆయేషాను హృదయపూర్వకంగా అభినందిస్తూ క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదల, నియమం ఉంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించగలవని ప్రోత్సహించారు. భవిష్యత్తులో ఆమెకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేందర్ రెడ్డి,రమేష్,శివరంజని, రూప,మధు,పప్యం శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి,అనిల్ ఆయేషా కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రేపు సాయిరాం కాలనీలో నగర సంకీర్తన



**జహీరాబాద్, భారతీయ వెలుగు ప్రతినిధి ఫిబ్రవరి 27:**
జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో మార్చ్ 1న ఆదివారం ఉదయం 6 గంటలకు పట్టణంలోని సాయిరాం కాలనీలో 196వ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ బాధ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హరేకృష్ణ మహామంత్ర జపం, ప్రభుపాదుల ప్రార్థన, కీర్తనలతో శోభాయమనంగా కొనసాగనుందని తెలిపారు. హోళీ మాసం సందర్భంగా భక్తులు వివిధ రకాల పూవులతో సంబరాలు జరుగుతాయని, భక్తులు సాంప్రదాయ వస్త్రధారణతో రావడమే కాకుండా తమ వెంట పూవులు తీసుకురావాలని కోరారు. తదనంతరం సంగారెడ్డి జిల్లా కంది హరేకృష్ణ టెంపుల్ బాధ్యుల ద్వారా సత్సంగ ప్రవచనం, నరసింహ ఆరతి, ప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

# 'జీఐ ఆన్ వీల్స్' పేరుతో తెలంగాణ ఆర్టీసీ సరికొత్త కార్యక్రమం.. దేశంలోనే తొలి ప్రయోగం

» బస్సులపై తెలంగాణకు చెందిన ఆరు జీఐ ట్యాగ్ కళారూపాల ప్రదర్శన
» తొలిదశలో ఆరు ఎక్స్‌ప్రెస్ బస్సులపై ప్రత్యేక స్టిక్కర్లు
» సంస్కృతిని చాటుతూ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యం
» ఎంజీబీఎస్‌లో బస్సులను ప్రారంభించిన గవర్నర్, రవాణా మంత్రి

**భారతీయ వెలుగు హైదరాబాద్ ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) తన బస్సుల ద్వారా రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటేందుకు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'జీఐ ఆన్ వీల్స్' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి చెందిన ఆరు భౌగోళిక గుర్తింపు (GI) పొందిన కళారూపాలను బస్సులపై అందంగా ప్రదర్శించనుంది. దేశంలోనే ఇటువంటి ప్రయోగం చేయడం ఇదే తొలిసారి. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రవాణా శాఖ మంత్రి పొన్నం




ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఈ ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట చేనేత చీరలు, నిర్మల్ పెయింటింగ్స్, చేర్యాల స్క్రోల్ పెయింటింగ్, వరంగల్ తివాచీలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళాకృతులను బస్సులపై ముద్రించారు. జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ఈ కళారూపాలకు ఆకర్షణీయమైన డిజైన్లను రూపొందించారు.
తొలిదశలో ఈ ప్రత్యేక స్టిక్కర్లను ఆరు ఎక్స్‌ప్రెస్ బస్సులపై అంటించి, ఆయా కళలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతాలకు నడుపుతారు. హైదరాబాద్ నుంచి వయా పోచంపల్లి, హనుమకొండ, నారాయణపేట, కరీంనగర్, నిర్మల్ మార్గాలలో ఈ బస్సులు ప్రయాణిస్తాయి.
తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు చేరువ చేయడంతో పాటు పర్యాటకులను ఆకర్షించడం, కళాకారులకు ప్రోత్సాహం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కళారూపాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. 2004-05లోనే పోచంపల్లి ఇక్కత్‌కు జీఐ ట్యాగ్ లభించగా, 2007లో కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీకి ఈ గుర్తింపు దక్కింది. సుమారు 400 ఏళ్ల చరిత్ర ఉన్న నిర్మల్ పెయింటింగ్స్, సిద్దిపేట జిల్లాకు ప్రత్యేకమైన చేర్యాల పెయింటింగ్, వరంగల్ వారసత్వానికి ప్రతీకగా నిలిచే తివాచీలు, నారాయణపేట సంప్రదాయ చేనేత చీరలు ఎంతో ప్రఖ్యాతి గాంచాయి. ఈ కళారూపాలను బస్సులపై ప్రదర్శించడం ద్వారా వాటికి మరింత ప్రచారం లభించనుందని ప్రభుత్వం భావిస్తోంది.

# నిమ్మగడ్డ ప్రసాద్‌ను వెంటాడుతున్న జగన్ మోసం !

వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు జగన్ తో కలిసి క్విడ్ ప్రో కో వ్యవహారాలు నడిపిన నిమ్మగడ్డ ప్రసాద్ ఇప్పటికీ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెట్టుబడుల పేరుతో ఆయన మోసం చేసిన రస్‌అల్‌ఖైమా న్యాయపోరాటం చేస్తోంది. తాజాగా సుప్రీంకోర్టు ఆయనను రూ.125 కోట్ల నగదు, 37 ఎకరాల భూమి పత్రాలను డిపాజిట్ చేయాలని ఆదేశించింది. నిజానికి ఆయనను రూ.600 కోట్ల జమ చేయమని చెప్పింది. కానీ తన వద్ద లేవని రూ.125 కోట్ల నగదు, 37 ఎకరాల భూమిని పెడతానని విజ్ఞప్తి చేశారు. త్వరలో ఈ మోసానికి సంబంధించి నిమ్మగడ్డ పాపం పండే అవకాశం ఉంది.

### డబ్బులు చెల్లించాలని రస్ అల్ ఖైమా కోర్టు తీర్పు

పెట్టుబడులను వడ్డీతో సహా చెల్లించాలని రస్ అల్ ఖైమా సివిల్ కోర్టు నిమ్మగడ్డ ప్రసాద్‌కు , ఆయన కంపెనీకి ఆదేశాలు



ఇచ్చింది. ఈ మొత్తాన్ని చెల్లించకుండా తప్పించుకునేందుకు ఆయన తెలంగాణ హైకోర్టు , ఇతర న్యాయస్థానాల్లో పిటిషన్లు వేస్తూ కాలయాపన చేస్తున్నారని =ూఖ×ూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తమకు రావాల్సిన సుమారు 600 కోట్ల రూపాయలను రికవరీ చేసేందుకు భారత్‌లో ఉన్న ఆయన ఆస్తులను జప్తు చేయాలని వారు కోరుతున్నారు.

### సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు

గతంలో సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ కోసం 600 కోట్ల రూపాయల డిపాజిట్ చేయాలని ఆదేశించినప్పటికీ, నిమ్మగడ్డ ప్రసాద్ తన వద్ద అంత నగదు లేదని కోర్టుకు విన్నవించారు. తాజా విచారణలో భాగంగా, 125 కోట్ల రూపాయల నగదుతో పాటు, తెలంగాణలోని మేడ్చల్ జిల్లా దేవరయాంజల్ పరిధిలో ఉన్న 37 ఎకరాల భూమి సుమారు 400 కోట్ల విలువైనదిగా భావిస్తున్న ఒరిజినల్ పత్రాలను కోర్టుకు సమర్పించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసును తదుపరి విచారణకు వాయిదా వేసింది.

### వాన్ పిక్ కుంభకోణంతో ఖల్లాస్

2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో వాడరేవు-నిజాంపట్నం పోర్టు , పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కోసం రస్ అల్ ఖైమా ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. అయితే, నిమ్మగడ్డ ప్రసాద్ రస్ అల్ ఖైమా నుంచి వచ్చిన పెట్టుబడులను దారి మళ్లించి, అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కుమారుడు జగన్ మోహన్ రెడ్డికి చెందిన కంపెనీల్లోకి క్విడ్ ప్రో కో పద్ధతిలో పెట్టుబడులుగా మళ్లించారు. దీనివల్ల ప్రాజెక్ట్ అటకెక్కి తమ పెట్టుబడులు వృథా అయ్యాయని రస్ అల్ ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ న్యాయపోరాటం మొదలుపెట్టింది.

### సెర్బియాలో ఓ సారి అరెస్ట్

ఈ ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో రస్ అల్ ఖైమా ప్రభుత్వం ఇచ్చిన ఫిర్యాదుతో 2019 జూలైలో ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. దీని ఆధారంగా నిమ్మగడ్డ ప్రసాద్‌ను సెర్బియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. తమను మోసం చేసి వందల కోట్లు మళ్లించారని రస్ అల్ ఖైమా ఆరోపించగా, సుమారు రెండు నెలల పాటు ఆయన సెర్బియాలో గృహనిర్బంధంలో ఉండాల్సి వచ్చింది. కరోనా కారణంగా జైళ్లలో ఉన్న వారిని వదిలేయడంతో ఆయన ఇండియాకు వచ్చారు. లేకపోతే అక్కడి జైల్లోనే ఉండేవారు.

# ప్రాణంకు విలువ కట్టలేము... ప్రమాదంలో పోతే తిరిగి పొందలేము

» ప్రయాణం నందు రోడ్డు భద్రతలో నిర్లక్ష్యం ప్రాణాంతకం
» పరిగిలో 'అరైవ్--అలైవ్' అవగాహన సదస్సు
» జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా

**భారతీయ వెలుగు:చీఫ్ బ్యూరో/వికారాబాద్, ఫిబ్రవరి:27,**
భూమిపై జన్మించిన ప్రతి ప్రాణంకు డబ్బుతో విలువ కట్టలేమని, శరీరం నుండి ప్రమాదానికి గురై అది పోతే తిరిగి పొందలేము అని ముక్యంగా మనిషి వాహనాలను ప్రయాణం నందు వాడే సందర్భంగా రోడ్డు భద్రతలో నిర్లక్ష్యం ప్రాణాంతకం అవుతుందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు.శుక్రవారం పరిగిలో 'అరైవ్--అలైవ్' అవగాహన సదస్సు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా, కొడంగల్ చౌరస్తా నుండి శారద గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించి, కార్యక్రమం లో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పరిగి సబ్ డివిజన్ పరిధిలోని వివిధ రవాణా సంఘాలకు చెందిన డ్రైవర్లకు ప్రముఖ కంటి ఆసుపత్రి మాక్స్ విజన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడులను పంపిణీ చేశారు. డ్రైవర్ల ఆరోగ్య సంరక్షణే రహదారి భద్రతకు మూలమని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు.
ఈ సదస్సులో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పౌరుడు



క్షేమంగా తన గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతోనే 'అరైవ్ -- అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించి నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు అనాథలు అవుతున్నాయని, ముఖ్యంగా వృత్తిపరమైన డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల, కంటి చూపు పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు."నిద్రలేమి, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేక పోవడమే మెజారిటీ రోడ్డు ప్రమాదాలకు కారణం. వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటిస్తే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలము" అని డ్రైవర్లను ఉద్దేశించి తెలిపారు. కంటి చూపులో లోపాలు ఉన్న డ్రైవర్లకు ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉంటుందని, అందువల్ల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, సూచించి, కళ్లజోడులను తప్పనిసరిగా వినియోగించాలని ఎస్పీ కోరారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి



చేయడంతో పాటు, వాహనాలకు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆటో, కార్, బస్సు, లారీ, హెవీ వెహికల్ డ్రైవర్ యూనియన్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. డ్రైవర్లతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరి, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,పరిగి ఆర్ టి ఓ వీరేందర్ నాయక్, పరిగి ఆర్టీసీ మేనేజర్, కృష్ణమూర్తి, పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, జిల్లా పోలీస్ ప్రసిడెంట్ ఆశోక్, పరిగి సబ్ డివిజన్ ఎస్.ఐ లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శోభాయమానం..శ్యామ్ నిషాన్ యాత్ర

**భారతీయ వెలుగు,హైదరాబాద్,ఫిబ్రవరి 27:**
రాధేశ్యామ్ నామస్మరణలు మార్మోగాయి. రంగురంగుల జెండాలతో సాగిన నిషాన్ యాత్రతో కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని శ్యామ్బాబా మందిర్ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కలియుగ కృష్ణుడిగా భావించే శ్యామ్ బాబా తన శిరస్సును శ్రీ కృష్ణుడికి దానమిచ్చిన రోజును పురస్కరించుకుని నిర్వహించే పాల్గున్ మహోత్సవం శుక్రవారం శ్యామ్ మందిర్ లో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్యామ్ మందిర్ లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశామహల్ నుంచి కాచిగూడ శ్యామ్ మందిర్ వరకు భక్తులు ప్రత్యేక శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాచిగూడ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి భక్తులకు ఆయన స్వాగతం ఫలికారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు రంగు రంగుల జెండాలతో నిషాన్ శోభాయాత్రలు నిర్వహించారు.



గుర్రాలు, ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనాలతో యాత్రలో పాల్గొన్నారు. రథాలపై శ్రీకృష్ణుడి చిత్రపటాలుంచి ఊరేగించారు. ఈ ఊరేగింపునకు శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ డకోటియా, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, రాందేవ్ అగర్వాల్, కృష్ణకుమార్ బడేగావ్వాలే, రాజ్కుమార్ విగ్, కపిల్ అగర్వాల్ తదితరులు స్వాగత వేదిక నుంచి ఘన స్వాగతం పలికారు. విజయ్, లాలు, చింటు, ఇషాన్, ఆనంద్, కేశవ్, విషాల్ రవి, కిరణ్, శ్యామ్, హిమాన్షు, క్రిష్ణ, రాహుల్, శ్రావణ్, పవన్, తన్వీ, తదితర భక్తులు పాల్గొని శోభాయాత్రను విజయవంతంగా



నిర్వహించారు. శ్యామ్ బాబా కు 56 రకాల మిఠాయిల నైవేద్యాన్ని సమర్పించారు. అలాగే బాబా విగ్రహాన్ని రకరకాల పూలు, పడ్లతో అలంకరించారు.

# డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి..

**- ట్రాఫిక్ ఏసీపి సి.హెచ్.శ్రీనివాస్**




**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 27:** డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ట్రాఫిక్ ఏసీపి సి.హెచ్.శ్రీనివాస్ సూచించారు. రామగుండం ట్రాఫిక్ పోలీస్ అరైవ్ అలైవ్ 2026 రహదారి భద్రత, నియమాలు పాటించుట 2వ దశ, రాష్ట్రవ్యాప్తంగా 22-02-2026 నుండి 28-02-2026 వరకు నిర్వహిస్తున్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో రహదారి భద్రతను పెంపొందించడానికి శుక్రవారం కమిషనర్ ఆఫ్ పోలీస్ రామగుండం ఆదేశాల మేరకు సి.హెచ్.శ్రీనివాస్ ట్రాఫిక్ ఏసీపి, రామగుండం ఆధ్వర్యంలో మన రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఉచిత కంటి పరీక్షలి, షుగర్ బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్లు, ఆటోడ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లు కు వారి కంటి పరీక్ష చేయించారు. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు చేయించడం జరిగింది. సుమారు 200 మంది డ్రైవర్లు పరీక్ష చేయించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపి శ్రీనివాసులు మాట్లాడుతూ డ్రైవర్లు తమ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవాలని, వారు సురక్షితమైన మార్గంలో పోవాలని వారికి సంబంధించిన డాక్యుమెంట్లు వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనం నడపరాదని ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.రాజేశ్వరరావు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామగుండం, జి.హరి శేఖర్, రామరాజు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే మా ధర్మం.. సురక్షిత ప్రయాణమే మా లక్ష్యం.

» "అరైవ్ అలైవ్ -- 2026" రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జహీరాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం, డ్రైవర్లకు కంటి పరీక్షలు.

» ట్రాఫిక్ నిబంధనలు మీకు, మీ కుటుంబానికి, ఇతర వాహనదారులకు రక్షణ.

» మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.

**జహీరాబాద్ భారతీయ వెలుగు ప్రతినిధి ఫిబ్రవరి 27** "అరైవ్ అలైవ్ -- 2026" రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ఈ రోజు తేది: 27.02.2026 న జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీ, పస్తాపూర్ చౌరస్తాలలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ప్రారంభించారు. అనంతరం ఎస్.వి. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మెగా ఐ-చెకప్ మెడికల్ క్యాంపును ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమమే "అరైవ్ అలైవ్ - 2026" అని అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాలలో జహీరాబాద్ ఒకటని, ఇతర రాష్ట్రాలను కలుపుతూ ఉన్న జాతీయ రహదారుల వలన ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుందని, ఈ సమస్యను తగ్గించేందుకు ఆదర్శనగర్ కాలనీ, పస్తాపూర్ చౌరస్తాలలో ట్రాఫిక్





సిగ్నల్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జహీరాబాద్ సబ్-డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, లారీలు, ఆటోలు నడిపే డ్రైవర్లకు కంటి చూపు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చూపులో లోపాలు ఉన్న వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కచ్చితమైన కంటి చూపు ఉన్నప్పుడే ఎలాంటి పరిస్థితుల్లోనైనా సురక్షితంగా డ్రైవింగ్ చేయగలమని అన్నారు.

ప్రతిరోజు పాఠశాలలు, కాలేజీలు, కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాహనాలను పరిమిత వేగంలో నడుపుతూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అతి వేగం ప్రమాదకరమని గుర్తు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మీకే కాకుండా మీ కుటుంబ సభ్యులకు, తోటి వాహనదారులకు కూడా రక్షణ కల్పిస్తుందని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ యజమానిని కోల్పోతే ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని గుర్తు చేశారు.

డ్రైవర్లు వాహనాల కండిషన్‌ను తరచూ తనిఖీ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. మద్యం మత్తులో ఏకాగ్రత కోల్పోవడం వల్ల ప్రమాదాలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనే ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, ఇన్స్పెక్టర్లు శివలింగం, హనుమంతు, మున్సిపల్ చైర్మెన్ యూనుస్. వైస్ చైర్మెన్ శిరిషా-సురేందర్ రెడ్డి, కమిషనర్ జైత్రం, ఆర్.టి.సి డిపో మేనేజర్ స్వామి, మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, టౌన్ మరియు రూరల్ ఎస్ఐలు వినయ్ కుమార్, కాశీనాథ్ తదితర సబ్-డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు ఆర్యవైశ్య యువజన సంఘం ఘన సన్మానం..

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట:పిబ్రవరి 27** జమ్మికుంట పట్టణంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ మరియు కౌన్సిలర్లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానిక రాధాకృష్ణ కళ్యాణ మండపంలో నిర్వహించబడింది.యువజన సంఘం అధ్యక్షుడు తంగళ్ళపల్లి శ్యామ్ కిషోర్ హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ నాయకుడు దేవునూరి వినయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లుగా గెలిచిన ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు చందా రాజు, బచ్చు మాధవి శివశంకర్‌తో పాటు ఇతర కౌన్సిలర్లు దిడ్డి రామ్, చింతల శ్రీనివాస్, కొలుగూరి సురేష్, గుర్రం కావ్య పరశురామ్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన సంఘం ప్రతినిధులు ప్రజల ఆశలను నెరవేర్చేలా సేవ చేయాలని, పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు అయిత మహేష్, లెంక్కలపెల్లి శరత్ కుమార్, యంసాని సురేష్, భూపతి సంతోష్ యాద శ్రీధర్ తదితరులు మరియు ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు...

# జగ్గాపల్లి గ్రామంలో పోచమ్మ తల్లి దేవాలయం సందర్శించిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్....

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 27...** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల పరిధిలోని జగ్గయ్యపల్లి గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ పోచమ్మతల్లి అమ్మవారిని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. గ్రామ ప్రజల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు కలశాలతో స్వాగతం చేయగా, యువకులు హారతులతో ఆతిథ్యం అందించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి సన్నిధిలో చైర్మన్ గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. అలాగే జమ్మికుంట పట్టణం మరియు పరిసర గ్రామాల అభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, రహదారులు, కాలువల నిర్మాణం, పారిశుధ్య పనులు మరింత వేగవంతం కావాలని కోరుతూ ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవత ఆశీస్సులతో ప్రజాసేవలో ముందుకు సాగుతానని తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వంశీ చైర్మన్ ని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. గ్రామ పెద్దలు ఆయనకు అభినందనలు





తెలియజేస్తూ తమ గ్రామ అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. చైర్మన్ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతోనే అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. కౌన్సిలర్లు కోలుగురి సురేష్, చింతల శ్రీనివాస్, పరశు రామ్, లక్ష్మణ్ తమ ప్రసంగాల్లో గ్రామ అభివృద్ధికి చైర్మన్ నాయకత్వం కీలకమని తెలిపారు. గ్రామ వార్డు సభ్యులు నోముల వినయ్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు కూడా తమ అభిప్రాయాలు వెల్లడించారు.

కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అమ్మవారి జాతరలు, ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు సహకరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. చివరగా గ్రామ ప్రజలతో చైర్మన్ ఆత్మీయంగా ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ విధంగా పోచమ్మతల్లి అమ్మవారి దర్శనం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. గ్రామ దేవత కటాక్షంతో జమ్మికుంట మండలంలో మరింత అభివృద్ధి, ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందాలని అందరూ ఆకాంక్షించారు.

# రంజాన్ వేడుకలను సోదర భావంతో జరుపుకోవాలి...

**- టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్**





**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి** సోదర భావంతో రంజాన్ వేడుకలు జరుపుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ పేర్కొన్నారు.రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఇఫ్తార్ విందులు కొనసాగుతున్నాయి. కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్ నగర్ కాలనీలో శుక్రవారం జరిగిన ప్రార్థనలకు టిపిసిసి ఉపాధ్యక్షుడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముస్లిమ్స్ తో కలిసి ప్రార్థన నిర్వహించారు. రంజాన్ శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నయీం, మోసిన్ ,సంతోష్, మదన్మోహన్, జావేద్ , ఫాతిమా, షేక్ ఖలీల్, షరీఫ్ ,మజార్ ,వాసిం, కుమార్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కుట్రలు పటాపంచలు

**- కడిగిన ముత్యంలా కవితక్క.**
**- కుట్రదారులకు చెంపదెబ్బ కోట్టే విధంగా తీర్పు ఇచ్చిన న్యాయ స్థానం.**
**- గుంజపడుగు హరిప్రసాద్**
**- జిల్లా అధ్యక్షులు తెలంగాణ జాగృతి**



**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 27** కరీంనగర్ లో తెలంగాణ జాగృతి అధ్వర్యంలో టపాసులు కాల్చి స్వీట్స్ పంపిణి చేసి సంబరాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత మీద పెట్టిన తప్పుడు కేసును పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూస్తే ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కేసును కొట్టివేయడం చాలా సంతోషకరమనీ ,కవిత పై పెట్టిన ఢిల్లీ లిక్కర్ కేసు అనేది తప్పుడు కేసు అని రౌస్ ఎవెన్యూ కోర్టు తేల్చి చెప్పి కేసులు కొట్టివేయడం సంతోషకరమైన విషయం సిపిఐ పెట్టిన లిక్కర్ లో కేసులో స్కాం లేదని కోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం కావాలని రాజకీయంగా దెబ్బ కొట్టడం కోసమే ఇలాంటి తప్పుడు కేసులకు పాల్పడిందని ఈ కేసులో కవిత తో పాటు కేజ్రీవాల్ మనీష్ సిసోసిడా అందరికీ క్లీన్ చీట్ వచ్చిందని అన్నారు. నిజం నిప్పులాంటిది ఎప్పటికైనా ధర్మం గెలుస్తుంది సత్యం నిలబడుతుంది చెప్పడానికి ఈ తీర్పే నిదర్శనం. తెలంగాణ ఆడబిడ్డపై అక్రమ కేసులు పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి న్యాయ స్థానంలో చెప్ప దెబ్బ లాంటి తీర్పు వచ్చిందని తెలంగాణ ప్రజలు రాబోయే ఈ కలలో అక్రమ కేసులు పెట్టిన కేంద్ర ప్రభుత్వాన్ని ఓటుతో బుద్ధి చెబుతారని అన్నారు. రాజకీయంగా సహకరించాని వారిపైన ఇలాంటి అక్రమ కేసులు పెట్టడం మానుకోకపోతే ప్రజలే బిజెపి పార్టీకి బుద్ధి చెబుతారని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, అధివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు వారల శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, పిన్నింటి సంగీత రెడ్డి, యండి సల్మ, పూదరి రజేశ్వరి గౌడ్, చంటి శ్రీనివాస్, కుర్ర పోచాయ్య, గాలిపల్లి రాత్మకర్ చారి, యండి హుసైన్ జంగ అపర్ణ, బండ అశోక్, సంతోష్ యాదవ్, కుర్ర కౌసిక్, బసవేణి రాజేందర్, గర్శకుర్తి విద్యాసాగర్, గుండెటి తిరుపతి పుసాల పవన్, వీణ రజీ తదితరులు పాల్గొన్నారు

# అరుణోదయ యూత్ క్లబ్ అధ్యక్షులుగా కాశెట్టి చంద్రమోహన్ ఏకగ్రీవ ఎన్నిక



**భారతీయ వెలుగు ఫిబ్రవరి 27** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని అరుణోదయ యూత్ క్లబ్ అధ్యక్షులుగా శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎల్ సంతోష్ గౌడ్ జనరల్ సెక్రటరీ వెంకటప్రసాద్ రెడ్డి ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో యువత అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కాశెట్టి చంద్రమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్పల్లె మున్సిపల్ చైర్మన్ శాత ప్రవీణ్ కుమార్, శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం సాని ప్రకాష్ గుప్తా, సీనియర్ నాయకులు చేకూర్త గోపాల్ రెడ్డి ,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సర్తాజ్ అరుణోదయ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

# సమరసతామూర్తుల క్యాలెండర్, సంత్ రవిదాస్ పుస్తకావిష్కరణ

**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 27** సంత్ రవిదాస్ 15-16వ శతాబ్దపు గొప్ప భక్తి ఉద్యమ కవి, ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త అని సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత బాధ్యులు పుల్లూరి రామారావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రమేష్ రెడ్డి కొనియాడారు.సంత్ రవిదాస్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సమరసతామూర్తుల క్యాలెండర్, సంత్ రవిదాస్ యొక్క పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం రోజున కరీంనగర్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ కాశీలో చర్మకారుల కుటుంబంలో జన్మించిన సంత్ రవిదాస్ ముఖ్యంగా కులం, మతం , లింగ బేధాలను వ్యతిరేకించారని, మనుషులందరూ సమానమని, తన భక్తి గీతాలు, అద్వైత బోధనలతో , భగవంతుడు ఒక్కడే అని



సమానాత్వాన్ని బోధించారన్నారు. సంత్ రవిదాస్ రాసిన భజనలు , శ్లోకాలు , సిక్కుల పవిత్ర గ్రంథం గురు గ్రంద్ సాహిబ్ లో చోటు చేసుకున్నాయన్నారు.

భక్తితోనే దేవుణ్ణి చేరుకోవచ్చనీ సంత్ రవిదాస్ అనేక భక్తి గీతాలు , ఆధ్యాత్మిక కవిత్వం భక్తి ఉద్యమంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. మనలోనే దేవుడు ఉన్నాడని ఆయన చాటి చెప్పారని, ఆయన బోధనలు నేటికీ ప్రజలను ప్రేరేపిస్తున్నాయన్నారు. రవితేజ జయంతిని మాఘ పౌర్ణమి రోజున ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు రమేష్ రెడ్డి

తెలంగాణ ప్రాంత భాద్యులు పుల్లూరి రామారావు పురుషోత్తం దావు సంతోష్ కుమార్ , చంద్రగిరి సత్తయ్య, దొంతుల మల్లేశం, దొంతుల శ్రీనివాస్, దేవరకొండ సునీల్, సుందరగిరి సందీప్, దేవరకొండ నరేష్ బాబు,దేవరకొండ చంద్రమోహన్ అలిసేరి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు పార్లమెంట్ కోఆర్డినేటర్ గా బేతి మహేందర్ రెడ్డి.

**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 27**

జనసేన సభ్యత్వ నమోదు చేసుకోండి – 5 లక్షల భీమా పొందండి.
తెలంగాణలోనే కరీంనగర్ ను జనసేన సభ్యత్వ నమోదులో అగ్రభాగాన నిలుపుతాం.
అవినీతి, అక్రమాల పై, ప్రజా సమస్యల పై పోరాటమే జనసేన లక్ష్యం.
కరీంనగర్ లో వాహనదారులకు అడ్డంగా ఉన్న ఈద్గా గోడను తొలగించాలని జనసేన డిమాండ్.
పార్టీల అగ్ర నేతల అంతర్గత ఒప్పంద రాజకీయాలను ప్రజల ముందు ఎండగట్టుతాం.
జనసేన పార్టీ సభ్యత్వ నమోదు పార్లమెంట్ కోఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి వెల్లడి.
జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రారంభించి, సభ్యత్వ నమోదుకు రూ.2 కోట్లు విరాళం అందించి, తొలి సభ్యత్వాన్ని పవన్ కళ్యాణ్ తీసుకున్నారని నూతనంగా నియామకమైన కరీంనగర్ పార్లమెంట్ సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. జనసేన పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకొని, పార్టీ



సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో వారిని "ఉద్యమి"గా, పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి, నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీ సిద్ధాంతాలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేసేవారిని "సాధక్"గా, జనసేన పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేథా శక్తిని, సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని "ప్రదాత"గా పిలుస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించడం జరిగిందని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు.
జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో ప్రైవేట్ ఉద్యోగులను, వివిధ రకాల యూనియన్ లను, వివిధ కుల సంఘాలను, చిన్న చిన్న వ్యాపారాలు, వీధి వ్యాపారులు, వర్తక, వాణిజ్య వ్యాపారాలు చేసుకునే వారి నుంచి కూలి పనులు చేసుకునే వారిదాకా, ముఖ్యంగా యువత, మహిళలను భారీ సంఖ్యలో ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగస్వాములు చేయాడమే లక్ష్యంగా, సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ?5 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కూడా కల్పిస్తామని, ఇంత మొత్తం భీమా ఏ రాజకీయ పార్టీ ఇవ్వట్లేదని పేర్కొంటూ, అలాగే జనసేన పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకొని, పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేవారే ముఖ్యమని, అలాంటి వారే పార్టీకి అవసరమని పేర్కొంటూ కరీంనగర్ ను తెలంగాణలోనే సభ్యత్వ నమోదులో అగ్రభాగాన నిలుపుతామని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు.
కరీంనగర్ లో వివిధ అభివృద్ధి ముసుగులో జరుగుతున్న పనులలో అవకతవకల పై, అవినీతి, అక్రమాల పై ఎప్పటికప్పుడు నిలదీస్తూ, ప్రజా సమస్యల పై పోరాటం చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీ పని చేస్తుందని, అలాగే వివిధ రాజకీయ పార్టీల అగ్ర నేతలు వారీ వ్యక్తిగత ఆర్థిక స్వప్రయోజనాల కోసం, అధికారం, హోదాల కోసం అంతర్గత ఒప్పంద రాజకీయాలను ప్రజల ముందు ఎండగట్టుతామని బేతి మహేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు.
మరి ముఖ్యంగా స్మార్ట్ సిటీగా పేర్కొంటున్న కరీంనగర్ లోని కళాభారతి ప్రక్కన వాహనదారులకు అడ్డంగా ఉన్న ఈద్గా గోడను తొలగించే విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కార్పొరేటర్ గా ఉన్న సమయంలో అనేక సార్లు తొలగించాలని డిమాండ్ చేసిన విషయం అందరికి తెలిసిందేనని, కానీ నేడు 2019 నుండి పార్లమెంట్ సభ్యునిగా, బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా, నేడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి భాధ్యతల్లో కొనసాగుతున్న కూడా కనీసం అడ్డంగా ఈద్గా గోడ తొలగించే విషయంలో చొరవ తీసుకోకపోవడం సిగ్గుచేటని, ఈ విషయంలో ప్రజలు చర్చించుకుంటున్నారని, అలాగే కరీంనగర్ నగర పాలక సంస్థ పాలకవర్గం బిజెపి చేజిక్కించుకున్న విషయం అందరికి తెలిసిందేనని, నగర పాలక సంస్థ మొదటి సర్వసభ్య సమావేశంలో అడ్డంగా ఉన్న ఈద్గా గోడను తొలగించాలని తీర్మానం చేసి ఆమోదం తెలిపే విధంగా మంత్రి బండి సంజయ్ కుమార్ పాలకవర్గానికి సూచించాలని డిమాండ్ చేస్తూ, వాహనదారుల ఇబ్బందులను, ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నేత బేతి మహేందర్ రెడ్డి బండి సంజయ్ కుమార్ ను డిమాండ్ చేశారు.
కరీంనగర్ పార్లమెంట్ జనసేన పార్టీ సభ్యత్వ నమోదుకు కోఆర్డినేటర్ గా నియమించినందుకు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్ కే సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు రాధారం రాజలింగం లకు బేతి మహేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కందుల రాజీ రెడ్డి, శివ రెడ్డి, పెంటాల మహేష్, పొన్నాల తిరుపతి, వోద్నాల రాజు, జంగ మహేష్, వీర్ల శ్రీనివాస్ రావు, సిరిసిల్ల రాము, కందకట్ల స్వరూప, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ రవిదాస్ ఉద్యమ కవి, ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త...

– సమరసతామూర్తుల క్యాలెండర్, సంత్ రవిదాస్ పుస్తకావిష్కరణ సందర్భంగా సామాజిక సమరసత బాధ్యులు రమేష్ రెడ్డి ,పుల్లూరి రామారావు,..

**భారతీయ వెలుగు ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 27..**

సంత్ రవిదాస్ 15-16వ శతాబ్దపు గొప్ప భక్తి ఉద్యమ కవి, ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త అని సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత బాధ్యులు పుల్లూరి రామారావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రమేష్ రెడ్డి కొనియాడారు.సంత్ రవిదాస్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సమరసతామూర్తుల క్యాలెండర్, సంత్ రవిదాస్ యొక్క పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం రోజున కరీంనగర్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కాశీలో



చర్మకారుల కుటుంబంలో జన్మించిన సంత్ రవిదాస్ ముఖ్యంగా కులం, మతం , లింగ బేధాలను వ్యతిరేకించారని, మనుషులందరూ సమానమని, తన భక్తి గీతాలు, అద్వైత బోధనలతో , భగవంతుడు ఒక్కడే అని సమానాత్వాన్ని బోధించారన్నారు. సంత్ రవిదాస్ రాసిన భజనలు , శ్లోకాలు , సిక్కుల పవిత్ర గ్రంథం గురు గ్రంద్ సాహిబ్ లో చోటు చేసుకున్నాయన్నారు. భక్తితోనే దేవుణ్ణి చేరుకోవచ్చనీ సంత్ రవిదాస్ అనేక భక్తి గీతాలు , ఆధ్యాత్మిక కవిత్వం భక్తి ఉద్యమంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. మనలోనే దేవుడు ఉన్నాడని ఆయన చాటి చెప్పారని, ఆయన బోధనలు నేటికీ ప్రజలను ప్రేరేపిస్తున్నాయన్నారు. రవితేజ జయంతిని మాఘ పౌర్ణమి రోజున ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు రమేష్ రెడ్డి
తెలంగాణ ప్రాంత భాద్యులు పుల్లూరి రామారావు పురుషోత్తం దావు సంతోష్ కుమార్ , చంద్రగిరి సత్తయ్య, దొంతుల మల్లేశం, దొంతుల శ్రీనివాస్, దేవరకొండ సునీల్, సుందరగిరి సందీప్, దేవరకొండ నరేష్ బాబు,దేవరకొండ చంద్రమోహన్ అలిసేరి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో బదిరుల పాఠశాలలో ముందస్తు సైన్స్ డే వేడుకలు.

**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 27**




ఫిబ్రవరి 28 నేషనల్ సైన్స్ డే ని పురస్కరించుకొని ముందస్తు గా నగరంలోని భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బధిరుల పాఠశాలలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు శివ జ్యోతి మాట్లాడుతూ పిల్లలు వినికిడి , మాటలు లోపంతో వివరణ చేయలేరు కనుక పిల్లల్లో ఉన్న మేధాశక్తిని ముగ్గుల ద్వారా సైన్స్ పటాలు వాళ్లలో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు వచ్చే దిశగా ప్రతి సంవత్సర లాగానే ఈ సంవత్సరం కూడా బదిరుల పాఠశాలలో సైన్స్ డే వేడుకలు నిర్వహించి పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గర్రెపల్లి రాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బదిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసీరామ్ , ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

## ఎన్పీడీసీఎల్, ట్రాన్స్కో అధికారులసర్కిల్ రివ్యూ సమావేశం

**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 27**

కరీంనగర్ సర్కిల్ రివ్యూ మీటింగ్ జరిగినది. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్ వరంగల్ టి .మధుసూదన్ వివరిస్తూ రాబోయే వేసవి కార్యచరణ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని ఏడీలకు , డిఈ లకు ఆదేశించడం జరిగింది. ఈ మీటింగ్ లో ఎన్పీడీసీఎల్ అధికారులు , ట్రాన్స్కో అధికారులు జాయింట్ రివ్యూ మీటింగ్ నిర్వహించి ట్రాన్స్కో లో వేసవి ప్రణాళిక సంబంధిత అవసరాలు ఎక్కడైతే పవర్ ట్రాన్స్ఫార్మర్లు కెపాసిటీ పెంపు, అదనం ట్రాన్స్ఫార్మర్లు , లైన్లో ఓవర్ లోడ్ గురించి చర్చలు జరిపి వాటిని వేసవి కాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చూసుకోవాలని , డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఓవర్ లోడ్ అయ్యే అవకాశం ఉంటే రికార్డెడ్ మాక్సిమం డిమాండ్ ఆధారం చేసుకొని అదనపు, సామర్థ్యం పెంపుదల ట్రాన్స్ఫార్మర్ పెట్టాలని , 33ఖ౦ డ 11ఖ౦




లైన్లు ఓవర్ లోడ్ అయ్యే అవకాశం ఉన్నచోట కొత్త లైన్లు ఏర్పాటు చేయమని , పోలె సంఖ్య నెంబరు వేసి ఆన్లైన్లోనే జిఐఎస్ కోఆర్డినేటర్స్ తో డిజిటలిజషన్ చేయాలని ఏఈలు ను ఆదేశించారు. ట్రాన్స్ఫార్మర్ గుట్ట ప్రాంతాల్లో ఉండే చోట లైటింగ్ అరెస్టులు త్వరగా ఎస్టిమేట్ వేసి పనిచేయాలని , ఇక నుండి ఎల్ సి ఆన్లైన్ లో తీసుకోవాలని, తీసుకోవడం వల్ల సంబంధిత సిబ్బంది భద్రత ప్రమాణాలు పాటిస్తారని ఆదేశించడం జరిగింది. ప్రజా బాట ప్రోగ్రాం మంగళవారం, గురువారం, శనివారం తమ సెక్షన్ పరిధిలో ఉన్న సిబ్బందిని తో అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకొని అదే రోజు ఆ సమస్యల్ని పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. ఇకపై ట్రాన్స్ఫార్మర్ ఫెయిల్ అయినచో డిపార్ట్మెంట్ లోని రవాణా చేయాలని , ట్రాన్స్ఫార్మర్స్ కాలిపోవడం 5 నుంచి 10 శాతం వరకు తగ్గాలని ఆదేశించడం జరిగింది. వినియోదారులకు అంతరాయాలు లేకుండా 11 ఖ౦,33ఖ౦ మెయింటెనెన్స్ చేయాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో బి .అశోక్ సిఈ(శీజూ-1)వరంగల్, విజయ్ కుమార్ పాపారావు సిఈ జోన్ ట్రాన్స్కో కరీంనగర్, వి గంగాధర్ ఎస్ ఇ ఓపి కరీంనగర్, ఎన్ శ్రీనివాస్ ఎస్ఇ ఓఎంసి ట్రాన్స్కో కరీంనగర్, డిఈలు ఉపేందర్, రాజం, లక్ష్మారెడ్డి,ఎం తిరుపతి మరియు ట్రాన్స్కో డీఈలు, ూూ రాజేంద్రప్రసాద్, ఏవోలు, ఏఏఓలు, ఏడిఈలు , తదితరులు పాల్గొన్నారు.

## మహిళా త్యాగమూర్తుల జీవిత చరిత్రను అధ్యయనం చేయాలి జేఏసీ నాయకుల పిలుపు

**భారతీయ వెలుగు – భీమదేవరపల్లి**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి , ఎలుకతుర్తి మండలాలలో ఆనాటి మహిళా త్యాగమూర్తుల జీవిత చరిత్రపై మహిళలకు వ్యాసరచన పోటీలు హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆనాటి మహిళా త్యాగమూర్తుల జీవిత చరిత్రలను నేటితరం అధ్యయనం చేయాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళలు చైతన్యవంతమై పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ రోజున బహుమతి ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వా లక్ష్మారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ దేగల సారయ్య, నాయకులు చెప్పియాల ప్రకాష్, గాండ్ల పద్మ, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, ఉప్పుల కుమారస్వామి, పెట్టం కుమారస్వామి, వేముల జగదీష్, ఓగే శేఖర్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్....

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 27.**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు లో బూరుగుపెల్లి శ్రీకాంత్ కుమార్తె చిన్నారి నేహశ్రీ మొదటి పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వార్డు ప్రజల సమక్షంలో అట్టహాసంగా నిర్వహించబడ్డాయి. ఇంటి ఆవరణ మొత్తం అలంకరణలతో మెరిసిపోతూ పండుగ వాతావరణాన్ని తలపించింది. చిన్నారి నేహశ్రీకి ఆకర్షణీయంగా అలంకరించిన వేదికపై కేక్ కటింగ్ కార్యక్రమం హర్షధ్వానాల మధ్య జరిగింది.
ఈ ఆనందోత్సవానికి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, విద్యాభివృద్ధి కలగాలని ఆకాంక్షిస్తూ తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అలాగే వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ పాల్గొని కుటుంబ



సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.
కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతల శ్రీనివాస్, కొలుగూరి సురేష్, పరుశురాం, దీక్షిత్ తదితరులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. వార్డు నాయకులు రాము, అఖిల్, అశోక్, అనిల్, శ్రీకాంత్, శ్రావణ్ తదితరులు పాల్గొని వేడుకను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. స్థానిక ప్రజలు, స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై కుటుంబానికి తమ అభినందనలు తెలియజేశారు.
చిన్నారి నేహశ్రీ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడగా, చిన్నారికి బహుమతులు అందజేశారు. పిల్లల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విందు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఒక్కరూ చిన్నారితో ఫోటోలు దిగుతూ ఆనందాన్ని పంచుకున్నారు.
ఈ సందర్భంగా కుటుంబ పెద్దలు మాట్లాడుతూ చిన్నారి మొదటి పుట్టినరోజును ఇంత ఘనంగా నిర్వహించడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, మిత్రులు, బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి నేహశ్రీ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, కుటుంబానికి కీర్తి తేవాలని అందరూ ఆకాంక్షించారు.

## రోడ్డు ప్రమాదల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకం

– ఖని వన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 27:**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన అరైవ్ అలైవ్ 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని లారీ అసోసియేషన్ లారీ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో సుమారు 100 మంది లారీ డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించు కున్నారు. డ్రైవర్లకు చూపు సమస్యలు ఉన్నాయా లేదా అనే అంశంపై వైద్యులు సమగ్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సూచనలు అందించారు. కంటి చూపు సరిగా లేకపోతే రోడ్డు ప్రమాదాలకు దారితీసే అవకాశముందని కావున డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ ఇంద్రసేన రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా కంటి పరీక్షలను నిరంతరం చేయించుకోవాలని సూచించారు. లారీ డ్రైవర్లకు కంటి చూపు పై అవగాహనా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ రమేష్ కంటి డాక్టర్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అమ్మవారికి సుహాసినిల ఒడి బియ్యం

– 108 సార్లు అష్టోత్తర శతనామాల జపం

**భారతీయ వెలుగు ప్రతినిధి, వేములవాడ**

వేములవాడ పట్టణంలో శుక్రవారం ఏకాదశి సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. పట్టణానికి చెందిన సుమారు 70 మంది బుక్క కుల సుహాసినిలు



లోకకళ్యాణార్థం అమ్మవారికి పసుపు, కుంకుమ, ఫలహారాలు, చీర, సారెతో పాటు ఓడిబియ్యం సమర్పించారు. మొదటి బైపాస్ రోడ్డునుంచి ఆలయం వరకు కోలాటాలతో నగర సంకీర్తన నిర్వహించిన మహిళలు, అనంతరం అమ్మవారి అష్టోత్తర శతనామాలను 108 సార్లు జపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమం ముగిసిన తరువాత పరస్పరం పసుపు, బొట్టు పెట్టుకుని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సుహాసినిలు దేవరకొండ అరుణకుమారి, బండి శైలజ, బండి వనిత, దేవరకొండ విద్య, కామారపు అనంతలక్ష్మి, కామారపు చంద్రిక, కామారపు సత్యలక్ష్మి, చింతల భాగ్యలక్ష్మి, చింతల విజయ, చింతల స్వరూప, దేవరకొండ జయశ్రీ, కామారపు వాణి, కామారపు మౌనిక, కామారపు శైలజ, దేవరకొండ వాసు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
శనివారం ఫిబ్రవరి 28, 2026

# ఇన్‌స్టాగ్రామ్ పరిచయం... పెళ్లి మాటలతో మోసం

- మహిళ బంగారు గొలుసు, నగదు అపహరణ
- లాడ్జి యజమానిపై కేసు
- వేములవాడ పట్టణ సీఐ బి. వీరప్రసాద్



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
సోషల్ మీడియా పరిచయం పెళ్లి మోసానికి దారి తీసిన ఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది.. శుక్రవారం పట్టణ సీఐ బి.వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఓ మహిళకు విజయవాడకు చెందిన వంశీ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. అనంతరం ఇద్దరూ వేములవాడకు వచ్చి మహేశ్వరి పరమేశ్వర లాడ్జ్‌లో గది తీసుకున్నారు. మహిళ బాత్రూంకి వెళ్లిన సమయంలో ఆమె బ్యాగ్‌లో ఉన్న సుమారు మూడు తులాల బంగారు గొలుసు, రూ.10 వేల నగదును అపహరించి నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. అతిథుల వివరాలు నమోదు చేయకపోవడంతో లాడ్జ్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అన్ని లాడ్జ్ నిర్వాహకులు గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా పరిశీలించాలని, నమోదు ప్రక్రియ సక్రమంగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని, సీఐ హెచ్చరించారు.

# జమ్మికుంట 23 వార్డు సందర్శించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ (దిలీఫ్ )...





**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 27..**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్వయంగా వార్డును సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎన్నికల సమయంలో తనపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన వార్డు కావడంతో ముందుగా ఇక్కడి ప్రజలను కలవాలని నిర్ణయించుకుని తెల్లవారుజామునే పర్యటన ప్రారంభించారు.
వార్డులోని ప్రధాన వీధులు, కాలనీలు, అంతర్గత రహదారులు, కాలువలు, తాగునీటి పైపులైన్లు, వీధి దీపాల పరిస్థితి తదితర అంశాలను పరిశీలించారు. కొన్నిచోట్ల చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడం, కాలువలు మూసుకుపోవడం, వర్షాకాలంలో నీరు నిలిచే సమస్యలు ఉన్నాయని స్థానికులు వివరించారు. దీనిపై చైర్మన్ వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులను ఫోన్ ద్వారా అప్రమత్తం చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడిన చైర్మన్ , "నన్ను ఆశీర్వదించి గెలిపించిన మీ అందరి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నా మొదటి కర్తవ్యం. వార్డు అభివృద్ధే నా ప్రాధాన్యత" అని పేర్కొన్నారు. ప్రతి కాలనీలో తాగునీటి సరఫరా సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, పాడైపోయిన రహదారులను దశలవారీగా మరమ్మతులు చేయించి కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు.
వార్డులోని మహిళలు, యువకులు, వృద్ధులు తమ సమస్యలను నేరుగా చైర్మన్ కి తెలియజేశారు. పింఛన్లు, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ స్తంభాల మరమ్మతులు, పారిశుధ్య కార్మికుల కొరత వంటి అంశాలను వివరించారు. వాటిపై సమగ్ర నివేదిక తయారు చేసి త్వరలోనే ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి పరిష్కార మార్గాలు చూపిస్తామని హామీ ఇచ్చారు.
అదేవిధంగా వార్డులో హరితహారం కార్యక్రమం మరింత విస్తృతంగా చేపట్టి ప్రతి వీధిలో మొక్కలు నాటాలని, యువత భాగస్వామ్యంతో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజల సహకారం ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు చేయగలమని తెలిపారు.
పర్యటన సందర్భంగా వార్డు ప్రజలు చైర్మన్ ని శాలువాతో సన్మానించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నాయకత్వంలో 23వ వార్డు ఆదర్శ వార్డుగా మారాలని ఆకాంక్షించారు.
ఈ సందర్శనతో వార్డు ప్రజల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకుని వెంటనే చర్యలు తీసుకునే నాయకత్వం అరుదని పలువురు అభిప్రాయపడ్డారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కానున్నాయని ఈ పర్యటన స్పష్టం చేసింది.

# కార్పొరేటర్ ను సన్మానించిన రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు



**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 27**
నగరపాలక సంస్థలో విలీనమైన మల్కాపూర్ గ్రామం 16 వ డివిజన్ కార్పొరేటర్ గా గెలిచిన సందర్భంగా మల్కాపూర్ గ్రామంలో కాంతాల జగన్ రెడ్డిని గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, కాసర్ల జితేందర్ రెడ్డి, కాంతాల ఇంద్రసేనారెడ్డి, నరహరి సత్యనారాయణ రెడ్డి గును కుల మహిపాల్ రెడ్డి, కాంతాల బాపురెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,శ్యామసుందర్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి సన్మానించి హిందువుల ఆరాధ్యుడు ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని అందించారు.ఈ సందర్భంగా రూరల్ ప్రాంతమైన మల్కాపూర్ గ్రామంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో డివిజన్ సమస్యలు పరిష్కరించాలని కోరారు

# జాతీయ స్థాయి ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలి

- ఓసి జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు



**భారతీయ వెలుగు కరీంనగర్**
ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పటిష్ట అమలుకు, ఓసి ల సంక్షేమం కోసం జాతీయ స్థాయి ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలని పలు డిమాండ్ల తో ఫిబ్రవరి 23 న దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ స్థాయి భారీ మహా ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వచ్చామని ఓసి జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. ధర్నాలో పాల్గొని విజయవంతం చేసి శుక్రవారం కరీంనగర్ కి చేరుకున్న పోలాడి రామారావుకు శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు ఓసి ఐకాస నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాయకుల తో కలిసి విలేకరులతో రామారావు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను దేశవ్యాప్తంగా పటిష్టంగాసంపూర్ణంగా అమలు చేయాలని, ఈడబ్ల్యూఎస్ కి కేటాయించగా మిగిలిపోయిన బ్యాక్ లాగ్ పోస్టులను ఈడబ్ల్యూఎస్ వారితోనే వెంటనే భర్తీ చేయాలని, ఈడబ్ల్యూఎస్ అర్హతకు 10 లక్షల రూపాయల వార్షిక ఆదాయ పరిమితిని విధించాలని, రైతు భీమా వయోపరిమితిని 70 ఏళ్లకు పెంచాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించే రైతుల భాగస్వామ్యం ఉండే రైతు చట్టం తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఢిల్లీలో ఓసి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి భారీ మహా ధర్నాలోని డిమాండ్లను అనంతరం కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేరేంతవరకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు.
ప్రభుత్వాలకు ఆరు నెలల గడువు ఇస్తున్నామని తక్షణమే డిమాండ్లను నెరవేర్చాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పోలాడి రామారావు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఐకాస రాష్ట్రఉమ్మడి జిల్లా నాయకులు వేముల సుదర్శన్ రెడ్డి,చెన్నాడి నర్సింహా రెడ్డి , ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొత్త కొండ రవీందర్ రావు, తీగల లక్ష్మణ్ రావు, ఏళ్ళల సదానంద రెడ్డి, కరివేద సుధాకర్ రెడ్డి, బొంపెల్లి శోభిత రావు, బూరుగు అనంత రెడ్డి, తోపు చర్ల శ్రీనివాస్ రావు, విక్రమ నరసింహ రావు, దడిగేలా వెంకట్ రావు, పట్నాయక్ తదితరులు ఉన్నారు

# నూతన కలెక్టర్ ప్రతిమ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన

- ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయి పేట ప్రతినిధి ఫిబ్రవరి 27**
మెదక్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రతిమ సింగ్ ఐఏఎస్ ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలో కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ, గతంలో మెదక్ జిల్లాకు డిప్యూటీ కలెక్టర్గా పనిచే జరిగిందని ఇదే జిల్లాలో తమకు కలెక్టర్ పదవిని ఇవ్వడం ఎంతో సంతోషకరమైన జిల్లాలలోని శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మెదక్ జిల్లాలోని ఎటువంటి అసంఘటిత సమస్యలు ఉన్నా కూడా నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే సునాశయంగా పరిష్కరించి సమస్యను పరిష్కరించే విధంగానే తాను వ్యవహరిస్తానని జిల్లా ప్రజల శ్రేయస్సు కోసమే తాను మళ్ళీ మెదక్ జిల్లాకు కలెక్టర్గా రావడం జరిగిందని మెదక్ జిల్లా ప్రజలు అందరితో ఎంతో మామ్యంగా ఉంటూ ఎటువంటి అల్లా కులాలకు తనువు ఇవ్వకుండా జిల్లా ప్రజలు ఉంటారని తాను మళ్ళీ మెదక్ జిల్లా కలెక్టర్గా రావడం జరిగిందని ప్రతిమ సింగ్ తెలిపారు ఆనంతరం ఆమె జిల్లా ఎస్పీ శ్రీనివాస్ కుమొక్కను అందజేశారు.

# అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో గత 55 శుక్రవారాలుగా కొనసాగుతున్న అన్న ప్రసాద వితరణ.

- గంధం ప్రశాంత్ 9 వ వార్డు సభ్యులు జన్మదినం పురస్కరించుకుని.....





**భారతీయ వెలుగు ప్రతినిధి వీణవంక ఫిబ్రవరి 27..**
కరీంనగర్ జిల్లా, వీణవంక మండలం, మల్లారెడ్డిపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో గత 55 శుక్రవారాలుగా కొనసాగుతున్న అన్న ప్రసాద వితరణ. ఈరోజు 55 శుక్రవారం గంధం ప్రశాంత్ 9 వ వార్డు సభ్యులు జన్మదినం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు గంధం నర్సమ్మ -లక్ష్మణ్ దంపతులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఆలయ చైర్మన్ గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ ఈ రోజు జన్మదినం జరుపుకుంటున్న గంధం ప్రశాంత్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ గత 55 శుక్రవారాలుగా మాకు సహకరిస్తున్న దాతలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఎలాంటి ప్లాస్టిక్, పేపర్ ప్లేట్లు, డిస్పోజల్ గ్లాసులు వాడకుండా అరటాకులలో భోజనాలు వడ్డిస్తున్నామని, పర్యావరణాన్ని రక్షించే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ముక్తవరం శ్రీదరాచార్యులు, అమ్మ ఫౌండేషన్ సభ్యులు బండారి సందీప్,కర్రె స్వామి,గంధం సుమన్,గంధం ప్రశాంత్ (9 వ వార్డు సభ్యులు) పూదరి సమ్మయ్య (మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రధాన కార్యదర్శి), గంధం లక్ష్మణ్,కిన్నెర సమ్మయ్య, మాజీ వార్డు సభ్యులు గంధం మోహన్,దూలం రాజమౌళి, కర్రె లచ్చయ్య,కర్రె రాజయ్య, శనిగరపు లాలయ్య,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కనీస వసతుల కల్పనను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ జయంత్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.


# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ విద్యానగర్‌లోని మసీదులో కాంగ్రెస్ నాయకురాలు సరిపెల్లి అర్చన-నరేష్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులు పరమత సహనానికి, స్నేహసంబంధాల బలోపేతానికి దోహదపడతాయని అర్చన పేర్కొన్నారు. మార్చి 21న జరగనున్న రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, మౌలాలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

- అరైవ్--అలైవ్ కార్యక్రమంలో ఏఎస్పీ రుత్విక్ సాయి పిలుపు




**భారతీయ వెలుగు ప్రతినిధి, వేములవాడ**
రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టె కోరారు. శుక్రవారం అగ్రహారం కే కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన 'అరైవ్--అలైవ్' అవగాహన కార్యక్రమంలో జేఎన్టీయూ, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన ముఖ్య సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగం అలవాటు చేసుకోవాలని చెప్పారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని విద్యార్థులకు సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళలు ఎలాంటి వేధింపులు ఎదురైనా జిల్లా షీ టీమ్ నంబర్ 87126 56425ను నిర్భయంగా సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ బి. వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్ఐ మోడెం సురేష్, ఎస్ఐలు రామ్మోహన్, సముద్రాల రాజు, షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మికుంట: ఇంటి పన్ను వసూళ్లలో 100 శాతం లక్ష్యాన్ని సాధించిన...

# వార్డు ఆఫీసర్ కోడం రాజుకు ఘన సన్మానం..

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 27..**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఆదర్శప్రాయమైన పరిపాలనకు నిదర్శనంగా నిలిచే విధంగా 28వ వార్డులో ఇంటి పన్ను వసూళ్లలో 100 శాతం లక్ష్యాన్ని సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధికి పన్నుల వసూళ్లు ప్రధాన ఆధారం అని పేర్కొన్నారు. ప్రతి వార్డులోనూ ప్రజల సహకారం, అధికారుల కృషి సమన్వయంతో ముందుకు సాగితేనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో 28వ వార్డులో ఇంటి పన్ను వసూళ్లను పూర్తిస్థాయిలో సాధించడం గర్వకారణమని తెలిపారు.

వార్డు ఆఫీసర్ కోడం రాజు కృషి, కట్టుబాటు, ప్రజలతో



సమన్వయం వల్లే ఈ విజయాన్ని అందుకోవడం సాధ్యమైందని కమిషనర్ ప్రశంసించారు. ఇంటింటికీ వెళ్లి పన్ను చెల్లింపులపై అవగాహన కల్పించడం, బకాయిలు ఉన్న వారికి ప్రత్యేకంగా చర్చలు జరిపి చెల్లింపులు చేయించడంలో రాజు చూపిన పట్టుదల ఇతర వార్డులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో పన్ను వసూళ్లు జరిపి మున్సిపాలిటీకి ఆదర్శంగా నిలిచినందుకు కోడం రాజును శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, ఏఎస్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణీ తదితర అధికారులు పాల్గొని వార్డు ఆఫీసర్ రాజును అభినందించారు. పట్టణ అభివృద్ధి, శుభ్రత, మౌలిక వసతుల విస్తరణలో పన్నుల వసూళ్లు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రజల సహకారం, అధికారుల నిబద్ధత కలిసి పనిచేస్తే జమ్మికుంట పట్టణం అభివృద్ధి పథంలో మరింత ముందుకు దూసుకెళ్తుందని కార్యక్రమంలో పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. 28వ వార్డు సాధించిన ఈ శతశాతం వసూళ్ల విజయగాథ మిగతా వార్డులకు స్ఫూర్తిగా నిలవనుందని తెలిపారు.

# ప్రమాదపు అంచుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

**- చోద్యం చూస్తున్న సెస్ అధికారులు**
**- తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ -- ప్రమాదాల భయం**
**- వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్**



**భారతీయ వెలుగు ప్రతినిధి, వేములవాడ**
వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్ నుండి విద్యానగర్, ఉర్దూ మీడియం పాఠశాల వెళ్లే గల్లీ మూలమలుపులో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. గల్లీలో పాఠశాల, మసీదు, నివాస గృహాలు ఉండటంతో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిరోజూ అదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు దాని పక్కనే నడవాల్సి వస్తోందని, సంబంధిత సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) అధికారులు కనీస భద్రతా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిల్లలు ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్‌కు దగ్గరగా వెళ్లే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా గల్లీ మూలమలుపులో ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడం వల్ల వాహనదారులకు అది స్పష్టంగా కనిపించకపోవడం మరింత ప్రమాదకరమని వారు చెబుతున్నారు. ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా పెద్ద విషాదానికి దారి తీసే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సెస్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేయడం, చుట్టూ రక్షణ కంచె నిర్మించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి భద్రతా చర్యలు వెంటనే చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో Arrive Aliveμμ ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం

**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 27**
రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ చేపట్టిన "ాతీతీఅజవ -- ాశ్రీఅజవ" కార్యక్రమంలో భాగంగా డ్రైవర్ల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం అత్యంత విజయవంతమైంది. పోలీస్ శాఖ , లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా శిబిరంలో 448 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు.

నగరంలోని ప్రముఖ కంటి ఆసుపత్రులు ఈ శిబిరంలో పాల్గొని డ్రైవర్లకు అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించాయి.

?డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ 85 మందికి,
?వాసన్ ఐ కేర్ 96 మందికి,
?లయన్స్ డాక్టర్ మాడేకర్ ఐ హాస్పిటల్ 85 మందికి ,
?శరత్ మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ 95 మందికి,
?డాక్టర్ రాకేష్ ఐ హాస్పిటల్ 87 మందికి పరీక్షలు నిర్వహించారు.



పరీక్షల అనంతరం అవసరమైన డ్రైవర్లకు లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరపున 200 కళ్లద్దాలు, 200 కంటి చుక్కల మందులను ఉచితంగా అందజేశారు. రేకుర్తి హాస్పిటల్ వారు సుమారు 50 మందికి ఉచిత సర్జరీ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ.. "సురక్షిత చూపు - సురక్షిత డ్రైవింగ్ - సురక్షిత గమ్యం" అనే నినాదంతో ఈ కార్యక్రమం



చేపట్టామని తెలిపారు. డ్రైవర్లకు కంటి చూపు సరిగ్గా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్ , అడిషనల్ డీసీపీ భీం రావు , ఏసీపీ లు వెంకటస్వామి , విజయకుమార్ ఇన్స్పెక్టర్లు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ తరపున ప్రెసిడెంట్ లయన్ ఏ. రవీందర్ రెడ్డి, వి. రాధాకృష్ణ రెడ్డి, వెంకట రమణ రెడ్డి, గౌతమ్ హెచ్. రాజిరెడ్డి పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా



**భారతీయ వెలుగు కరీంనగర్, ఫిబ్రవరి 27:**
కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన చిత్ర మిశ్రా, గురువారం నాడు జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు.జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, జిల్లా యంత్రాంగం , పోలీస్ శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకోవడంలో భాగంగా ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, తాజా పరిస్థితులు మరియు ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టర్, సీపీలు క్లుప్తంగా చర్చించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా భద్రత కోసం రెవెన్యూ , పోలీస్ శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

# స్వచ్ఛంద ఐక్య సంఘాల వేదికలో పదవుల కలకలం..

- ప్రజల్లో లేని వారికి ఉన్నత పదవులు..
- నిస్వార్థంగా పని చేస్తున్న వారిని గుర్తించని వైనం..
- సంస్థ స్థాపన చేసిన వారికి గుర్తింపు ఏది..?
- ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి భర్తలు ఉండచ్చా..?

**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 27:**
పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పట్టణంలో శుక్రవారం జరిగిన స్వచ్ఛంద సంస్థల ఐక్య సంఘాల వేదిక నూతన కార్యవర్గ బృందం ఎంపికలో ముందు నుంచి సమాజంలో నిసహాయులకు సేవ చేస్తున్న వారిని కాదని.. అసలు సంస్థ స్థాపన చేసిన వారిని కాదని కమిటీ వేశారనే సభ్యులు ఆరోపించడం వివాదానికి తావిస్తోంది.. గతంలో కమిటీ వేసిన వారిని పరిగణలోకి తీసుకోకుండా పనిచేయని వారిని వేశారని ఆరోపిస్తున్నారు. ఒక విధంగా చూస్తే ఈ కమిటీ చిల్లర అనే విధంగా కమిటీ సభ్యులు చెప్పడం వివాదాస్పదంగా మారింది. అప్పుడు.. ఇప్పుడు.. నెలకు ఒకసారి కార్యక్రమాలు చేపడుతూ.. మేము కూడా ఐక్య సంఘాల వేదికలో భాగమే అని ఉన్నత



పదవులను చేపట్టాలంటే మేమే అని ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో కార్యవర్గాన్ని ఏర్పరచడం అస్యాస్పదంగా మారినది. దీన్ని గమనిస్తున్న మేధావి బృందం నిస్వార్ధంగా నిజాయితీగా నిస్సహాయులకు ఎక్కడ వెనకాడకుండా సేవ చేస్తున్న స్వచ్ఛంద సంఘాల వారిని పట్టించు కోకుండా కేవలం వారిని ప్రమోట్ చేసుకోవడానికే అని నూతన కార్యవర్గన్ని ఏర్పాటు చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి భర్తలు ఉండచ్చా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది.. ఐటీ చూపించుకోవడం కోసమేనా ఇలాంటి స్వచ్ఛంద సంస్థలను వాడుకుంటున్నారు అనే ఆరోపణలు వస్తున్నాయి. అసలైన స్వచ్ఛంద సేవకులు ఇందులో ఎందరు ఉన్నారు.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. అసలు సంస్థ స్థాపించిన వారిని గుర్తించకుండా వేరే వ్యక్తులను తీసుకువచ్చి కమిటీలు వేసి ఒక గ్రూపుగా ఏర్పడి సంపాదించుకోవడానికి ఇలా చేస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది. ఒక ప్రముఖ నాయకున్ని వాడుకుంటూ ఇప్పటికి తనతో డబ్బులు ఖర్చు పెట్టి నేడు కూడా డబ్బులు ఖర్చు పెట్టేందుకు ఒక ప్రణాళిక తయారు చేసుకుంటూ తనను కమిటీలో చేర్చకుండా నాయకునిగా తననే ప్రచారం చేసుకుంటూ డబ్బుల సంపాదనే తానే మొత్తం అన్నట్లు ప్రచారాలు చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకొక వ్యక్తి తన భార్య ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న తాను సమాజ సేవ చేస్తున్నానని చెప్పి సొంతంగా ఒక 80 లక్షలతో ఇల్లు నిర్మించుకున్నాడు. ఇదంతా ఒక తంతు అయితే...స్వచ్ఛంద సేవ చేస్తున్నామని చెప్పుకునే, కొంతమంది వారి జేబులో నుంచి రూపాయి ఖర్చు పెట్టకుండా చందాలు వసూలు చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, అయితే ఈ చెందాలతో పాటు సదరు ఆ సంస్థ నిర్వాహకుడు కానీ ఆ స్వచ్ఛంద సంస్థ గాని వారీ చందా ఎంత ఉంటుంది అందులో అనేది ఎవరికి తెలియని విషయం?? స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులుగా స్వచ్ఛంద సంస్థలను నిర్వహించే వ్యక్తులుగా ముందు మన వంతు ఎంతో కొంత సహాయాన్ని ఇచ్చి తర్వాత చందాలు అడగడం ఒక పద్ధతి కానీ అలా కాకుండా ఏ స్వచ్ఛంద సంస్థకు అయితే పనిచేస్తున్నారో ఆ స్వచ్ఛంద సంస్థ నుంచి ఒక్క రూపాయి విరాళం లేకుండా కేవలం బయట నుంచి సోషల్ మీడియా ద్వారా అభ్యర్థిస్తూ చందాలు వసూలు చేస్తూ సేవా కార్యక్రమాలు చేసుకుంటున్నారు, కానీ చందాలు ఇచ్చిన వ్యక్తులు సంస్థలు వాళ్ళ పేర్లు కనీసం ఎవరికి తెలవదు, ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేని ఆ స్వచ్ఛంద సంస్థ పేరుని మాత్రం సమాజంలో అంతా మేమే చేసాం అనే ధోరణిలో కార్యక్రమాలు నిర్వహించడం ఎంతవరకు కరెక్ట్, అని స్థానిక ప్రజలు వారి అభిప్రాయాన్ని చెప్పకనే చెప్తున్నారు... ఈ తంతు ఇలాగే కొనసాగితే నిస్వార్థంగా పేద ప్రజలకు చేసే సేవ కార్యక్రమాలు కూడా రానున్న రోజుల్లో వ్యాపారంగా మారిపోయే ప్రమాదం ఉందని స్వచ్ఛందంగా సేవ చేసే స్వచ్ఛంద సంస్థల ఉనికికే ప్రమాదం ఏర్పడే విధంగా పలు సంస్థలు వ్యవహరిస్తున్నాయని ఇకనైనా ఈ పద్ధతి మారితే బాగుంటుందని స్థానిక ప్రజలు అంటున్నారు. వాటికి సంబంధించిన బిల్లులు ఉండవు.. అసలు సమాజ సేవా ఎవరు చేస్తున్నారు.. అసలైన సమాజ సేవకులు ఎవరు.. నకిలీ ఎవరూ.. అనేదానిపై ప్రత్యేక కథనం త్వరలో...

# ఐఎన్‌టీఎస్ఓలో శ్రీ కాకతీయ విద్యార్థుల ప్రభంజనం



**భారతీయ వెలుగు హుజురాబాద్:**
హుజురాబాద్ పట్టణంలోని శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టీఎస్ఓ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి తీసుకువచ్చారు. శ్రీ చైతన్య కరిక్యులం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పాఠశాల విద్యార్థులు అనేక విభాగాల్లో బహుమతులు సాధించి ప్రభంజనం సృష్టించారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిని పిట్ట రిషేంద్ర చౌహన్ గెలుచుకోగా, రెండో బహుమతులను కె. తరుణిక, బింగి అక్షర సాధించారు. మూడో బహుమతులను మాట్లా అయాన్స్, రిషిక్ రెడ్డి, భరత సాత్విక అందుకున్నారు. నాలుగో బహుమతులను విజువల్, వర్షకేశ్వరావు, సహర్ష్ రెడ్డి, దాసరి చరణ్య, పి. తేజస్విని సాధించారు. అదనంగా 54 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు, 12 మంది స్పెషల్ ప్రైజులు, 93 మంది గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లా సందీప్ కుమార్ మాట్లాడుతూ, తమ విద్యార్థులు విద్యలోనే కాకుండా పోటీ పరీక్షల్లోనూ సత్తా చాటుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాడు శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం మధుసూదన్ రెడ్డి, కోఆర్డినేటర్లు రాంబాబు, విజయలక్ష్మి, డీన్ శ్రీనివాస్, ప్రైమరీ ఇన్‌చార్జ్ రజితతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల ఈ విజయం పాఠశాలకు మరింత గౌరవం తీసుకువచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# చిలుకూరు బాలాజీ గుడి ప్రధాన అర్చకులు స్వర్గస్తులైనారు పరామర్శించిన సబిత రెడ్డి

**రాజేంద్రనగర్ : మహేశ్వరం, ఫిబ్రవరి 27 భారతీయ వెలుగు ప్రతినిధి**



చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ ఎం.వి. సౌందరరాజన్ పరమపదించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సౌందరరాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తు వారి కుమారుడు సీఎస్ రంగరాజన్కి, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన గౌరవ మాజీ మంత్రివర్యులు మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి.శ్రీమతి సబితా ఇంద్రా రెడ్డి.

# చంద్రగ్రహణం కారణంగా రాజన్న, భీమన్న ఆలయాల మూసివేత

**- మార్చి 3న మూసివేస్తున్నట్లు అధికారులు వెల్లడి**



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
కేతుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3న ఉదయం 6.15 గంటల నుంచి రాత్రి 7.15 గంటల వరకు వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం తో పాటు, శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం, అనుబంధ ఆలయాలను మూసివేస్తున్నట్లు శుక్రవారం ఆలయ అధికారులు తెలిపారు. గ్రహణం ముగిసిన అనంతరం సాయంత్రం 7.15 గంటలకు పుణ్యాహవచనం నిర్వహించి, ఆలయం అంతట సంప్రోక్షణ చేపట్టి, ప్రదోష పూజ, మహా నివేదన కార్యక్రమాల తర్వాత భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం చేయనున్నట్లు వెల్లడించారు. మార్చి 3న ఉదయం 3.40 నుంచి 4.15 వరకు సంప్రోక్షణ, 4.15 నుంచి 4.45 వరకు మంగళ వాయిద్యాలు, 4.45 నుంచి 5.00 వరకు సుప్రభాతం, 5.00 నుంచి 6.00 వరకు ఆలయ శుద్ధి, ప్రాతఃకాల పూజలు నిర్వహించబడతాయని తెలిపారు. భక్తులు ఈ మార్పులను గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

# రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులను సన్మానించిన విశ్రాంత ఉద్యోగులు



**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 27**
కరీంనగర్ జిల్లా రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంగంజిల్లా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ఎండి ఉస్మాన్ పాష, ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి, జిల్లా అసోసిఎట్ అధ్యక్షులు నాగమోహన్, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జీవి మనోహర్ కుమార్, కోశాధికారిపి ,రామచంద్రం లను నగరములోని సంఘ భవనంలో విశ్రాంత ఉపాధ్యాయులు నరహరి లక్ష్మారెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులుఏ, శ్రీధర్ రావు, గంట్ల నరసింహారెడ్డి, బి,నరేందర్, ఎష్ట్ర, రమేష్ రెడ్డి, పి,రామ్ చంద్ర రావు, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, కర్ర ప్రభాకర్ రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయి ఉన్న డిఏలు, మెరుగైన పిఆర్సి, ఇప్పించడానికి జిల్లా శాఖ,రాష్ట్ర నాయకత్వానికి ప్రాతినిధ్యం ప్రాతినిధ్యం చేసి ఇప్పించాలని కోరారు

## నిద్రలో సమాధానం...



ఒక చిక్కు ప్రశ్నకి ఎంతకీ సమాధానం దొరకడం లేదు... ఫ్రెండ్ చూపెట్టిన పజిల్‌ని చేదించాలని చాలాసేపట్నుంచీ ప్రయత్నించి విసిగిపోయారు.... ఓ సమస్యకు పరిష్కారం కోసం వెతుకుతుంటే ఎదురుగా అన్నీ చిక్కుముడులే... అలాంటి పరిస్థితి ఎదురైతే కాసేపు అవన్నీ పక్కన పెట్టి హాయిగా నిద్రపోండి. అదేంటీ, ప్రశ్నకు సమాధానం కావాలంటే పడుకొమ్మంటున్నారు అనుకుంటున్నారు కదా! అదేంటంటే నిద్రలోనే మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అంటున్నారు అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. అవును, నిద్రలో గాఢనిద్ర, కాస్త మెలకువ- మగత కలగలసిన నిద్ర... ఇలా వేర్వేరు దశలు ఉంటాయి కదా... వాటిల్లో రెమ్(రాపిడ్ ఐ మూమెంట్)నిద్ర కూడా ఒక దశ. ఈ దశలో మనల్ని వెంటాడుతున్న సమస్య ఏంటో మనకు గుర్తుంటుంది. కాకపోతే ఇక్కడ మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసే భావోద్వేగాలన్నీ నెమ్మదించి, మెదడు మాత్రమే చురుగ్గా ఉంటుంది. ఆ సమయంలో మెదడు పాత అనుభవాన్ని వాడుకుని చిక్కుముడులన్నీ తొలగించి పరిష్కారాన్ని వెతుకుతుంది. తెల్లారి మనల్ని వేధిస్తున్న ప్రశ్నలకు అచ్చంగా అలానే కాకపోయినా, మరొక రూపంలో అయినా సమాధానం దొరుకుతుందట.

# అన్ని మసాలా దినుసులూ ఒకే మొక్కకు!



బిర్యానీ ఘుమఘుమలు అదిరిపోవాలన్నా, మటన్ మసాలా రుచికరంగా కుదరాలన్నా, చికెన్ ఫ్రై ఘాటుగా ఉండాలన్నా... ఇంత ఉప్పు, అంత కారంతోపాటు దాల్చినచెక్క, లవంగం, జాజికాయ, జాపత్రి... వంటి మసాలా దినుసులన్నింటినీ అందులో వేయాల్సిందే కదా! కానీ ఈసారి అవేమీ వేయకుండా ఒకే ఒక దినుసుతో మాంచి మసాలా ఫ్లేవర్‌ని తేవచ్చు. అవును మరి... అన్ని మసాలా రుచుల్నీ ఇచ్చే ఆల్‌స్పైస్ మొక్క ఇది!

దాదాపు 500 ఏళ్ల క్రితం మాట. ప్రపంచ యాత్రికుడు కొలంబస్ మసాలా దినుసుల్ని వెతుకుతూ అనుకోకుండా జమైకాకి చేరుకున్నాడు. అక్కడ గిరిజనులు వంటల్లో ఒక ప్రత్యేకమైన గింజల్ని వేయడం చూశాడు. నల్లగా గుండ్రంగా ఉన్న వాటిని మిరియాలుగా భావించి, తనతోపాటు యూరప్‌కి తీసుకెళ్లాడు. కారం కోసం వాటిని వంటల్లో వేస్తే సరికొత్త మసాలా రుచి వచ్చింది దానికి. అలా 'ఆహా! ఏమి రుచి' అని ఆశ్చర్యపోయి, వాటిని ఆల్‌స్పైస్, జమైకన్ పెప్పర్, న్యూస్పైస్, పిమియెంటా అంటూ రకరకాల పేర్లతో పిలవడం మొదలుపెట్టారు. మాంసాన్ని నిల్వ చేయడానికీ, వంటల్లో కమ్మటి రుచి కోసం వాడే ఈ స్పైస్ పెప్పర్- అలా నెమ్మదిగా అన్ని ప్రాంతాలకు చేరుతూ వచ్చింది. మిద్దె తోటల మీద ఇష్టం, ఎగ్జోటిక్ పంటలంటే ఆసక్తి పెరగడంతో విదేశీ మొక్కలు మన దగ్గరా కనిపిస్తున్నాయి. అందులో భాగంగానే ఈ ఆల్‌స్పైస్ ప్లాంట్‌ని ప్రతి పెరట్లో ఉండాల్సిన మొక్కగా చెబుతూ ఈమధ్య కుండీల్లో తెగ పెంచుతున్నారు.

ఆల్‌స్పైస్ అన్న పేరు వినగానే అన్నీ కలిపిన మసాలా పొడేమో అని అనిపించినా- ఇది ఒక రకమైన మసాలా మొక్క. దీని ఆకుల్నీ, గింజల్నీ పొడి చేస్తే గరం మసాలా తయారైపోయినట్టే! దాల్చిన చెక్క, లవంగం, జాజికాయ, మిరియాలు, అల్లం వంటివన్నీ కలిపినట్టుగా ఉంటుంది ఆ రుచి!

జమైకాతో పాటు దక్షిణ అమెరికా దేశాల్లో ఎక్కువగా సాగు చేసే ఈ మొక్కను ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పండిస్తున్నారు. వంటల్లోనే కాదు, ఔషధ గుణాలున్న ఈ మొక్కను వ్యాధుల నివారణలోనూ ఉపయోగిస్తున్నారు. లాభాలేంటో చూద్దాం...

పనిని సులువు చేస్తూ వంటకు అన్ని రకాల మసాలా రుచుల్నీ అందించే అద్భుతమైన ఈ దినుసుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి. సి-విటమిన్, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పొటాషియం... తదితర పోషకాలతో ఉండే ఈ ఆల్‌స్పైస్- వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. ఇంకా గుండె ఆరోగ్యానికీ, గట్ హెల్త్‌కీ పనిచేస్తుంది.


శరీరానికి ఎన్నో రకాలుగా మేలు చేసే యూజినాల్ రసాయన పదార్థం దీంట్లో అధిక మొత్తంలో ఉంటుంది. కీళ్ల నొప్పుల్నీ, కండరాల నొప్పుల్నీ తగ్గిస్తుంది ఇది. నెలసరి నొప్పి, జలుబు, అజీర్తి, తలనొప్పి, అలసట, వికారం... వంటివాటికి మంచి ఔషధం కూడా.

ఆల్‌స్పైస్‌లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎన్నో ఉన్నాయి. దీంట్లోని శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్లు వైరస్‌నీ అడ్డుకుంటాయి. రొమ్ము, ప్రొస్టేట్, గ్యాస్ట్రిక్, పేగు క్యాన్సర్లనీ... అల్జీమర్స్, పార్కిన్‌సన్స్... వంటి వ్యాధుల్నీ నిరోధిస్తాయి.

దీన్నుంచి తీసిన తైలాన్ని సౌందర్య ఉత్పత్తులూ, కొవ్వొత్తుల తయారీలో ఉపయోగిస్తారు.

మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజన్ స్థాయులు తగ్గిపోవడంతో నిద్రలేమి, మూడ్ స్వింగ్స్, బరువు పెరగడం... వంటి లక్షణాలెన్నో వస్తాయి. అలాంటి సందర్భాల్లో ఆల్‌స్పైస్‌లోని తైలం ఈస్ట్రోజన్ స్థాయుల్ని పెంచి, ఈ లక్షణాల్ని తగ్గించగలదని పరిశోధనలు చెబుతున్నాయి.

ఆకలి తగ్గించే గుణమున్న ఆల్‌స్పైస్ బరువు తగ్గాలనుకునేవాళ్లకూ ఉపయోగపడుతుంది. రక్తంలోని చక్కెర స్థాయుల్ని నియంత్రిస్తూ, మధుమేహులకు మేలు చేస్తుందీ మసాలా దినుసు. రుచితోపాటు ఆరోగ్యాన్నీ ఇస్తుంది కాబట్టే, ఈ ఆల్‌స్పైస్‌ని అన్ని రకాల వంటల్లో వేస్తున్నారు. మాంసాహార వంటకాల్లోనే కాదు, డిజర్ట్స్‌లోనూ దీన్ని బాగానే వాడుతున్నారు. బ్రెడ్, కేక్, సాసుల తయారీలోనూ దీని ఫ్లేవర్‌ని జత చేస్తున్నారు. పచ్చళ్లలో ప్రత్యేకమైన రుచి కోసం ఈ మసాలా దినుసును కలుపుతున్నారు. ఎండిన ఆల్‌స్పైస్ ఆకులతో టీ, సూప్, కషాయం లాంటివీ చేసుకుని తాగుతున్నారు. మీరూ ఓసారి ఈ మొక్క గురించి ఆరా తీసి... ఇంటి పెరట్లో పెట్టుకున్నారంటే- మసాలా కావాల్సినప్పుడల్లా నాలుగైదు ఆకుల్ని తెంపి అలా కూరల్లో వేసేయొచ్చు, ఏమంటారు!?




# స్కోరు తగ్గితే... బేజారే!

ఎంత సంపాదిస్తున్నారు, ఎంత ఖర్చు చేస్తున్నారు, ఎన్ని అప్పులు చేశారు, ఏమేరకు తీర్చారు, ఇంకెన్ని పేరుకుపోయాయి?... వగైరా వగైరా వివరాలతో కూడిన ఆర్థిక చిత్రగుప్తుడి చిట్టాను పిల్లనిచ్చే మామలూ, కొలువులిచ్చే బాసులూ, ఇల్లు అద్దెకిచ్చే యజమానులూ క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. మీ క్రెడిట్ స్కోర్ జాగ్రత్త మరి! పొదుపు - మదుపు ప్రయాణం సుదీర్ఘమైంది. తొలిజీతం అందుకున్న రోజే రిటైర్మెంట్ ప్లాన్ గురించి ఆలోచించాలంటే ఎంత దూరదృష్టి ఉండాలీ! వెయ్యి రూపాయలతో మొదలుపెట్టి కోటికి నిచ్చెన వేయడానికి ఎంత ఆశావాదాన్ని సమకూర్చుకోవాలీ! మార్కెట్ నేలచూపులు చూస్తున్నప్పుడూ స్థిరంగా వ్యవహరించాలంటే ఎంత గుండెధైర్యం కావాలీ! ఎవరితోనూ పోల్చుకోకుండా, ఎవరి ప్రభావానికీ లోనుకాకుండా మనదైన మార్గంలోనే వెళ్లడానికి ఎంత స్థితప్రజ్ఞత సాధించాలీ!... ఇవన్నీ జీవిత క్రమశిక్షణలో భాగమైన ఆర్థిక క్రమశిక్షణ లక్షణాలు కూడా. క్రెడిట్ స్కోర్ ఆ 'ఫైనాన్షియల్ డిసిప్లిన్'కు తిరుగులేని కొలమానం. నిన్న మొన్నటి వరకూ ఆ నివేదిక అప్పుల ఆమోదానికో, క్రెడిట్ కార్డుల జారీకో పరిమితమై ఉండేది. కానీ ఇప్పుడు కార్పొరేట్ కంపెనీలు ఉద్యోగం ఇస్తున్నప్పుడూ, బీమా సంస్థలు పాలసీ మంజూరు చేస్తున్నప్పుడూ, ఆడపిల్లల తల్లిదండ్రులు వరుడిని అన్వేషిస్తున్నప్పుడూ... క్రెడిట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్న సందర్భాలూ అనేకం. ఆర్థిక వ్యక్తిత్వాల్ని అంచనా వేయడానికి ఈ అంకెలు ఆధారం అవుతున్నాయి. ట్రాన్స్‌యూనియన్ సిబిల్, ఎక్స్‌పీరియన్, ఈక్విఫాక్స్ తదితర సంస్థలు మన దేశంలో క్రెడిట్ రేటింగ్ సేవల్ని అందిస్తున్నాయి. ఆయా కంపెనీలు రూపొందించే క్రెడిట్ రిపోర్ట్‌లో మన పేరు, వృత్తి ఉద్యోగాలు, వార్షిక సంపాదన, ప్రస్తుత అప్పులూ తీరిపోయిన రుణాలూ, గత - ప్రస్తుత క్రెడిట్ కార్డుల వివరాలూ, బిల్లుల బకాయిలూ రుణ వాయిదాల చెల్లింపులో జాప్యాలూ, ఈ మూడేళ్లలో అప్పు కోసం చేసుకున్న దరఖాస్తుల లెక్కలూ... సవివరంగా ఉంటాయి. ఆలస్యాలూ అపరాధ రుసుములూ పెరిగేకొద్దీ స్కోర్ పడిపోతుంది. సకాలంలో జరిగే ప్రతి చెల్లింపుతోనూ ఎన్నోకొన్ని మార్కులు వచ్చిపడతాయి. మన 'క్రెడిట్ లిమిట్'లో ఎంత మేరకు ఉపయోగించుకున్నాం అన్నదీ ప్రస్తావిస్తారు. దీన్నే 'క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో' అంటారు.



ఉదాహరణకు కార్డు పరిమితి లక్ష రూపాయల వరకూ ఉన్నప్పుడు, లక్షకు లక్షా వాడేసుకుంటే మాత్రం స్కోర్ పడిపోతుంది. అందుకే, గరిష్ఠ పరిమితిలో ముప్పై శాతానికి మించకూడదని సలహా ఇస్తారు నిపుణులు. బ్యాంకులూ, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలూ, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలతో ఒప్పందాల కారణంగా... క్రెడిట్ ఇన్ఫర్మేషన్ సంస్థలకు వినియోగదారుల సమస్త రుణ లావాదేవీలూ తెలిసిపోతుంటాయి. వాటిని ఓచోట చేర్చి, సమగ్రంగా విశ్లేషించి... పూర్ (300-599), డౌట్‌ఫుల్ (600-649) యావరేజ్ (650-699), గుడ్ (700-749), ఎక్సలెంట్ (750-900)... ఇలా అనేక రకాలుగా వర్గీకరిస్తాయి. ఎవరికి వారు నిర్ణీత రుసుము చెల్లించి, సిబిల్ లాంటి సంస్థల వెబ్‌సైట్ల నుంచి క్రెడిట్ రిపోర్ట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బ్యాంకుల వెబ్‌సైట్లూ, వివిధ ఫైనాన్షియల్ యాప్స్ ద్వారా కూడా కాపీలు తీసుకోవచ్చు. కొన్ని సంస్థలు వార్షిక సభ్యత్వం కింద... 'అన్‌లిమిటెడ్ డౌన్‌లోడ్' ఆప్షన్‌నూ అందిస్తున్నాయి. దీనివల్ల, ఎప్పటికప్పుడు మన స్కోర్‌ను సమీక్షించుకోవచ్చు. 'నెలకోసారి అయినా మీ రిపోర్ట్‌ను తనిఖీ చేసుకోవడం సురక్షితం' అని సలహా ఇస్తుంది క్రెడిట్ ఇన్ఫర్మేషన్ దిగ్గజం సిబిల్. ఇది మన ఆర్థిక ఆరోగ్య నివేదిక. తగ్గిపోయిన ప్రతి మార్కూ... డబ్బు విషయంలో మన క్రమశిక్షణా రాహిత్యాన్ని ఎత్తిచూపుతుంది. దాంతోపాటే తప్పులను తెలుసుకుని, లోపాలను సరిదిద్దుకునే అవకాశమూ కల్పిస్తుంది. ఆర్థికంగా చురుకైన జీవితం గడుపుతున్నంత కాలం, ఉత్తమ విద్యార్థిలా అంకెల బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తూనే ఉండాలి. 'అబ్బాయి అందగాడు. మంచి ఉద్యోగం. లక్షల జీతం. అయినా, ఆ సంబంధాన్ని సిఫార్సు చేయలేకపోతున్నాం...' నసిగాడు మ్యారేజ్ బ్యూరో ఎగ్జిక్యూటివ్. 'అంటే, తనకు ఎవరితో అయినా...' రెట్టించాడు పెళ్లికూతురి తండ్రి. 'ఛఛ... ఆ విషయంలో కుర్రాడికి వంకపెట్టడానికి వీల్లేదు. అయినా, ఇంతవరకూ వచ్చాక దాచేదేముందీ...' అంటూ ఓ కవర్ చేతిలో పెట్టాడా ఎగ్జిక్యూటివ్. ఆసక్తిగా తెరిచి చూశాడు అమ్మాయి తండ్రి. అది వరుడి క్రెడిట్ రిపోర్ట్. స్కోర్ ఐదొందల లోపే ఉంది. 'అస్సలు వద్దు!' కచ్చితంగా చెప్పేశాడా పెద్దమనిషి. ఇలాంటి దృశ్యాలు మ్యారేజ్ బ్యూరోలలో సర్వసాధారణం అవుతున్నాయి. పెళ్లి కొడుకుల బలహీనతల్నీ చీకటి స్నేహాల్నీ కనిపెట్టడానికి అమ్మాయి వైపు వాళ్లు డిటెక్టివ్ ఏజెన్సీల సాయం తీసుకోవడం కొత్త విషయమేం కాదు. మారుతున్న పరిస్థితుల కారణంగా, అక్కడితో ఆగకుండా... క్రెడిట్ స్కోర్ గురించీ తెలుసుకుంటున్నారు. నిజమే మరి, ఆర్థికంగా నిలకడ లేనివాడికి పిల్లనివ్వడమంటే... చూసిచూసీ ఓ అమాయకురాలి గొంతు కోయడమే. వచ్చిన జీతం వచ్చినట్టు క్రెడిట్ కార్డు బిల్లులకూ, బ్యాంకు వాయిదాలకూ వెళ్లిపోతుంటే... ఎంత సంపాదించీ ఏం లాభం? కట్టుకున్నదాని అచ్చటా ముచ్చటా ఎలా తీరుస్తాడూ, పుట్టబోయే పిల్లల్ని ఏం పెట్టి పోషిస్తాడూ? ఈమధ్య మహారాష్ట్రలోని మూర్తిజాపూర్‌లో ఓ ఆడపిల్ల తండ్రి... కాబోయే అల్లుడి క్రెడిట్ స్కోర్ పరమ చెత్తగా ఉందనే కారణంతో నిశ్చితార్థం వరకూ వెళ్లిన పెళ్లిని రద్దు చేశాడు. పనిలోపనిగా, 'బ్యాక్‌గ్రౌండ్ చెక్' సరిగా లేదంటూ మ్యారేజ్ బ్యూరోవాళ్ల మీదా కేసు వేశాడట. అందుకే, భవిష్యత్తులో ఈ తరహా సమస్యలు తలెత్తకుండా... ఫొటోలూ, ప్రొఫైల్‌తోపాటూ క్రెడిట్ రిపోర్టులూ పంపమని పెళ్లికొడుకులకు గట్టిగా చెబుతున్నారు పేరయ్యలు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు కాకపోవచ్చు కానీ, చాలా సందర్భాల్లో ఆర్థిక సంబంధాలు కూడా మానవ సంబంధాల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఏ కారణం వల్లనో పెళ్లికి ముందు అబ్బాయి క్రెడిట్ స్కోర్‌ను పట్టించుకోకుండా వదిలేసినా, ఆ తర్వాత ఎప్పుడో ఒకప్పుడు ఆ పత్రం బయటపడి తీరుతుంది. కాపురంలో చిచ్చులూ పెడుతుంది. ఇద్దరూ కలిసి హోమ్‌లోన్‌కు వెళ్లినప్పుడు, రెండో వ్యక్తి స్కోర్ సరిగాలేని కారణంగా బ్యాంకులు అప్పు ఇవ్వడానికి నిరాకరించే ఆస్కారం ఉంది. ఆలూమగలు ఫ్లోటర్ పాలసీ కింద ఆరోగ్య బీమా తీసుకోవాలని అనుకున్నప్పుడూ ఇలాంటి చేదు అనుభవమే ఎదురుకావచ్చు. జీవిత భాగస్వాములు వ్యాపార భాగస్వాములుగా మారిపోయి ఓ కంపెనీని స్థాపించినప్పుడు కూడా కో-పార్ట్‌నర్ నాసిరకం క్రెడిట్ స్కోర్ రుణాలకు అవరోధంగా మారుతుంది. ఆధునిక జీవితాల్లో, దంపతుల విడాకులకు ఈ మాత్రం కారణాలు సరిపోతాయి. సంబంధం ఖాయం చేసుకోడానికి ముందే, వరుడి ఆర్థిక జాతకాన్ని పరిశీలిస్తే ఇలాంటి గండాల్ని తప్పించుకోవచ్చు. స్కోర్ బావుంటే, ఆపైన ఇద్దరూ ఒప్పుకుంటే... శుభస్య శీఘ్రం! తగ్గితే కుదరదు...

కూలీకెళ్లిన రేవులోనే... కోటీశ్వరుడయ్యాడు!

ఆ యువకుడికి బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉంది. అప్పటికే ఒకట్రెండు సంస్థల్లో పనిచేశాడు. ఆ అర్హతతో ఓ జాతీయ బ్యాంకులో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఫైనల్ ఇంటర్వ్యూ వరకూ వెళ్లాడు. నియామక పత్రం అందడమే ఆలస్యం. అంతలోనే, ఆ బ్యాంకు మానవ వనరుల విభాగం నుంచి అతనికి ఓ మెయిల్ వెళ్లింది. 'క్రెడిట్ స్కోర్ నాసిరకంగా ఉన్న కారణంగా, మీకు కొలువు ఇవ్వడం కుదరదు' అని తేల్చిపడేశారు. దీంతో అతను న్యాయం కోసం కోర్టుకెళ్లాడు. ఇరు వర్గాల వాదనలూ విన్నాక, 'బ్యాంకు నిర్ణయం సబబే' అని తీర్పు ఇచ్చింది మద్రాసు హైకోర్టు. బ్యాంకులేనా, కార్పొరేట్ కంపెనీలు కూడా నియామకానికి ముందు అభ్యర్థుల క్రెడిట్ స్కోర్‌ను జాగ్రత్తగా గమనిస్తున్నాయి. ఈ నిర్ణయానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆర్థిక సమస్యలు మనిషిని ప్రశాంతంగా ఉండనీయవు. ఆ పరిస్థితుల్లో ఏకాగ్రతతో పనిచేయలేరు. తరచూ పొరపాట్లు జరుగుతాయి. ఈఎమ్ఐల భారం వల్ల మొదటి వారంలోనే జీతంరాళ్లు కరిగిపోతాయి. చేబదుళ్ల కోసం సహోద్యోగుల ముందు చేతులు చాస్తారు. అప్పు అంటేనే డబ్బు ఇచ్చి శత్రువుల్ని కొనుక్కోవడం. ఆ కారణంగా నలుగురితో సత్సంబంధాలు ఉండవు. ఫలితంగా, పని వాతావరణం దెబ్బతింటుంది. ఆర్థిక ఒత్తిళ్ల నడుమ కంపెనీ ఆస్తులనో, డేటానో దుర్వినియోగం చేసే ఆస్కారమూ లేకపోలేదు. ప్రతినెలా లోటు బడ్జెటే కాబట్టి, ఇంకేదో సంస్థ కాస్తంత ఎక్కువ జీతం ఇస్తామనగానే వెనకాముందూ ఆలోచించకుండా రాజీనామా చేసి వెళ్లిపోతారు. కాబట్టే, ఎంత సమర్థులైనా ఎన్ని విద్యార్హతలున్నా... అప్పుల అప్పారావుల్ని ఆమడదూరంలో ఉంచుతున్నాయి పెద్ద కంపెనీలు. ప్రత్యేకించి పాలసీబజార్, లెండింగ్‌కార్ట్ లాంటి ఆర్థిక సంస్థలు కీలక సిబ్బంది నియామకంలో క్రెడిట్ స్కోర్‌ను కొలమానంగా తీసుకుంటున్నట్టు సమాచారం.

# అభిషేక్‌పై యువరాజ్ సింగ్ ప్రశంసలు




టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చాడు. ఈ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఘోరంగా విఫలమైన ఈ యువ ఓపెనర్ తాజాగా జింబాబ్వేతో మ్యాచ్‌లో అర్ధ శతకంతో రాణించాడు. 30 బంతుల్లో 55 పరుగులు చేసి, తన ఫామ్‌పై మేనేజ్‌మెంట్‌కు ఉన్న అనుమానాలన్నింటినీ పటాపంచలు చేశాడు. ఈ క్రమంలోనే అతడి ఇన్నింగ్స్‌పై మాజీ క్రికెటర్, తన మెంటార్ యువరాజ్ సింగ్ మోటివేషనల్ మెసేజ్ పంపించాడు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ షేర్ చేశాడు. అభిషేక్ ఇన్నింగ్స్‌పై ప్రశంసలు కురిపిస్తూ మెసేజ్ రాసుకొచ్చాడు. 'అర్థంలేని చర్చలు జరుగుతున్నప్పుడు బ్యాటింగ్ తోనే మాట్లాడావు. అభిషేక్ సార్ ఇది మంచి ప్రదర్శన. ఇలాగే ముందుకు సాగిపో' అని ఇన్‌స్టా స్టోరీ రాసుకొచ్చాడు. అయితే ఈ టోర్నీలో అభిషేక్ వరుసగా ఫెయిల్ అవ్వడంతో అతడిపై తీవ్రంగా విమర్శలు వచ్చాయి. అందుకే అతడికి మద్దతుగా యువీ ఈ మెసేజ్ షేర్ చేశాడని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. అలాగే ఈ మ్యాచ్‌లో ఆకట్టుకున్న హార్దిక్ పాండ్య, అర్షదీప్ సింగ్‌పై కూడా యూవీ ప్రశంసలు కురిపించాడు. 'అద్భుతమైన పవర్ హిట్టింగ్. ఇన్నింగ్స్‌ను అద్భుతంగా ముంగించావు' అని హార్దిక్‌ను ప్రశంసించగా, 'స్పీడ్‌స్టర్ అర్షదీప్ ట్రిపుల్ ధమాకా. సరైన సమయంలో వికెట్లు తీసి ప్రత్యర్థులను ఒత్తిడిలోకి నెట్టావు' అని యువీ పోస్టు చేశాడు. ఇటీవల అభిషేక్ విఫలం అవ్వడం వల్ల అతడు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ ఆమిర్ కూడా అభిషేక్‌పై తీవ్ర విమర్శలు గుప్పించాడు. 'అభిషేక్‌కు డిఫెన్సివ్ క్రికెట్ ఆడడం రాదు. స్కిల్స్ లేవు, అతడు ఓ స్లోగర్ మాత్రమే' అని వ్యాఖ్యానించాడు. అయితే ఆమిర్ వ్యాఖ్యలకు తాజాగా టీమ్ఇండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కౌంటర్ ఇచ్చాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో దీనిపై మాట్లాడాడు. 'అభిషేక్‌పై మహ్మద్ ఆమిర్ చేసిన కామెంట్స్ తాలూకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే 'ఏ విధంగా అభిషేక్ మీకు స్లాగర్‌గా కనిపిస్తున్నాడు'. అతని ఆటతీరు గురించి మాట్లాడొచ్చు. కానీ, అలాంటి వ్యాఖ్యలు చేయడం సబబు కాదు. రీసెంట్‌గా జింబాబ్వేతో మ్యాచ్‌లో అతడి బ్యాటింగ్ సూపర్' 'తన మెంటార్ యువరాజ్ సింగ్ అని అందరికీ తెలుసు. కానీ యువరాజ్ కంటే అభిషేక్‌కే పవర్ ఎక్కువ. తాను బాదిన బంతి ఎంతో దూరం వెళ్తుంది. అయితే, అతడికి స్కిల్స్ లేవని కొందరు అనుకుంటారు. కానీ అభిషేక్ జింబాబ్వేపై తాజా మ్యాచ్‌లో అతడు అద్భుతమైన నైపుణ్యం దర్శించాడు' అని అశ్విన్ అభిషేక్‌పై ప్రశంసలు కురిపించాడు. అయితే తన వ్యాఖ్యలు కాంట్రవర్సీ అవ్వడంతో ఆమిర్ ఇప్పటికే దీనిపై సారీ చెప్పాడు. కాగా, ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా బ్యాటర్లు హార్దిక్ పాండ్య, ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సాధించారు. ఈ ఇద్దరూ యువరాజ్ సింగ్ రికార్డ్‌ను సమం చేశారు. సింగిల్ టీ20 వరల్డ్‌కప్ ఎడిషన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్లుగా యువీ రికార్డ్‌ను హార్దిక్, ఇషాన్ సమం చేశారు. 2007 ఎడిషన్‌లో యువీ 12 సిక్స్‌లు బాదగా, ప్రస్తుత టోర్నీలో హార్దిక్, ఇషాన్ ఇప్పటికే చెరో 12 సిక్స్‌లు బాదేశారు. ఇంకో సిక్స్ బాదితే యువీ రికార్డ్ బ్రేక్ అవుతుంది. అయితే పొట్టి కప్పులో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత్ బ్యాటర్‌గా రోహిత్ శర్మ టాప్‌లో ఉన్నాడు. అతడు 2024లో 15 సిక్స్‌లు కొట్టాడు.



# శ్రీలంక జట్టులో భారీ మార్పులు..

టీ20 వరల్డ్ కప్ 2026లో దారుణ ప్రదర్శన తర్వాత శ్రీలంక క్రికెట్ జట్టులో మార్పులు చోటుచేసుకోనున్నాయి. సహ-ఆతిథ్య దేశం అయిన శ్రీలంక జట్టు టోర్నమెంట్ సూపర్-8 దశ నుండే నిష్క్రమించడం జట్టుకు, అభిమానులకు తీవ్ర నిరాశ కలిగించింది. పొట్టి ప్రపంచ కప్‌లో లంక ప్రదర్శన ప్రభావం జట్టు కెప్టెన్, సెలక్షన్ కమిటీపై పడే అవకాశం ఉంది. కెప్టెన్ దాసున్ షనకను తొలగిస్తారని మాజీ క్రికెటర్లు అంచనా వేశారు.గ్రూప్ స్టేజ్‌లో వరుసగా 3 మ్యాచ్‌లు గెలిచి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చిన శ్రీలంక జట్టుపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే లంక జట్టు సూపర్-8కు చేరుకోగానే, దాని ప్రదర్శన దారుణంగా తయారైంది. సూపర్ 8 పోరులో తొలి మ్యాచులో ఇంగ్లాండ్‌తో ఓటమి చవిచూసింది. ఆ తర్వాత న్యూజిలాండ్ సైతం లంకేయుల్ని తేలికగా ఓడించింది. ఈ రెండు వరుస ఓటములతో శ్రీలంక జట్టు దాదాపు సెమీఫైనల్ రేసు నుంచి తప్పుకున్నట్లే. 2014లో టీ20 వరల్డ్ కప్ గెలిచిన శ్రీలంక జట్టు, గత కొన్ని సంవత్సరాలుగా మేజర్ టోర్నమెంట్లలో టాప్-4 కి కూడా చేరుకోలేకపోతోంది. స్వదేశంలో ఆడటం కలిసొచ్చే అంశమైనా తీవ్రంగా నిరాశపరుస్తూ లంక జట్టు అంచనాలను అందుకోలేకపోయింది. మరోసారి ప్రపంచ కప్ నెరవేరకుండానే, కనీసం తుది పోరుకు సైతం చేరకుండానే ఇంటి బాట పట్టింది. దాంతో లంక క్రికెట్ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ఏఎఫ్‌పీ నివేదిక, వార్తా సంస్థల సమాచారం ప్రకారం, టీ20 వరల్డ్ కప్ 2026 ముగిసిన తర్వాత శ్రీలంక క్రికెట్ బోర్డు తమ జట్టు ప్రదర్శనను రివ్యూ చేయనుంది. ఆ తర్వాత కెప్టెన్ దసున్ షనక, జాతీయ సెలక్టర్లను తొలగించడం వంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. కొంతమంది తమ పదవుల నుంచి తప్పుకునే అవకాశం ఉందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. శ్రీలంక హెడ్ కోచ్ సనత్ జయసూర్య, వరల్డ్ కప్ తర్వాత తాను పదవి నుండి తప్పుకుంటానని గతంలోనే ప్రకటించారు. అటువంటి పరిస్థితుల్లో ఈ మెగా టోర్నీ తరువాత టీమ్ మేనేజ్‌మెంట్‌లో భారీ మార్పులు తప్పవని చెప్పవచ్చు. న్యూజిలాండ్‌తో జరిగిన ఓటమి తర్వాత కెప్టెన్ దసున్ షనక తీవ్ర నిరాశకు లోనయ్యాడు. సొంతగడ్డపై తమ ప్రేక్షకుల ముందు ఈ తీరుగా టోర్నమెంట్ నుండి నిష్క్రమించడం అత్యంత అవమానకరమైన విషయమని అంగీకరించారు. జట్టు మంచి ఆరంభాన్ని అందుకున్నప్పటికీ, కీలక సమయాల్లో బౌలర్లు, బ్యాటర్లు ఒత్తిడికి లోనవడంతో ఓటములు తప్పలేదని పేర్కొన్నాడు. ఇకపై ఒకరు లేదా ఇద్దరు ఆటగాళ్లపై ఆధారపడటం మానుకోవాలని జట్టుకు సూచించారు. టీ20 వంటి వేగవంతమైన ఫార్మాట్‌లో పాజిటివ్ థింకింగ్, దూకుడు వైఖరి చాలా అవసరం, కానీ ఈ టోర్నమెంట్‌లో జట్టు కొన్నిసార్లు ఆ ఆటతీరును ప్రదర్శించలేకపోయిందని ఒప్పుకున్నాడు.




# అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త చరిత్ర

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. గురువారం చెన్నై వేదికగా జరిగిన సూపర్-8 పోరులో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ సెమీఫైనల్ బెర్త్‌కు అడుగు దూరంలో నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. ఇది టీ20ల్లో భారత్‌కు అత్యధిక స్కోరు కాగా, వరల్డ్ కప్ చరిత్రలో రెండో అతిపెద్ద స్కోరు. బ్యాటర్లు శివాలెత్తిన వేళ, బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త రికార్డులతో చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ రికార్డుల వేట సాగించాడు. జింబాబ్వేపై 4 ఓవర్లలో కేవలం 24 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు 33 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్న జస్ప్రీత్ బుమ్రాను అర్ష్‌దీప్ అధిగమించాడు. కేవలం 19 మ్యాచుల్లోనే అర్ష్‌దీప్ 35 వికెట్లు తీసి ఈ ఘనత సాధించడం విశేషం. బుమ్రా 23 మ్యాచుల్లో 33 వికెట్లు తీయగా, అశ్విన్ (32 వికెట్లు), హార్దిక్ పాండ్యా (29 వికెట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఒక లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా అత్యధిక వికెట్లు తీసిన ప్రపంచ రికార్డును కూడా అర్ష్‌దీప్ తన పేరిట రాసుకున్నాడు. న్యూజిలాండ్ స్టార్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ (34 వికెట్లు) రికార్డును అతను బద్దలు కొట్టాడు. 257 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేను భారత బౌలర్లు కట్టడి చేశారు. ఆ జట్టు ఓపెనర్ బ్రయన్ బెనెట్ (97 నాటౌట్) ఒంటరి పోరాటం చేసినా, మిగిలిన వారు విఫలమవడంతో జింబాబ్వే 184 పరుగులకే పరిమితమైంది. అర్ష్‌దీప్ మినహా మిగిలిన భారత బౌలర్లు పరుగులు ధారాళంగా సమర్పించుకోవడం కొసమెరుపు. భారత్ సాధించిన ఈ విజయంతో సౌతాఫ్రికా సెమీఫైనల్‌కు అర్హత సాధించగా, గ్రూప్-1 నుంచి రెండో సెమీస్ బెర్త్ కోసం భారత్, వెస్టిండీస్ మధ్య పోటీ నెలకొంది. ఆదివారం వెస్టిండీస్‌తో జరగబోయే మ్యాచ్‌లో గెలిస్తే భారత్ అధికారికంగా సెమీస్ చేరుతుంది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ విధ్వంసానికి సునీల్ గవాస్కర్ వంటి దిగ్గజాలే ఫిదా అవ్వగా, బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్ స్వదేశీ బుమ్రాగా తన ముద్ర వేస్తున్నాడు. భారత్ ఇదే ఫామ్ కొనసాగిస్తే రెండోసారి టీ20 ప్రపంచ కప్ అందుకోవడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.



TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
శనివారం ఫిబ్రవరి 28, 2026

# 'తెలంగాణ తొలి మెట్టు" నూతన సంవత్సర -2026 క్యాలెండర్ ను ఆవిష్కరించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 27**

ఇటీవలే ప్రజల ముంగిట్లోకి వచ్చిన తెలంగాణ 'తొలి మెట్టు దినపత్రిక" తన తొలి 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంది. శుక్రవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని తన నివాసంలోని కార్యాలయంలో తెలంగాణ తొలి మెట్టు ఎడిటర్ రావుల రమేష్ తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలంగాణ తొలి మెట్టు దినపత్రిక 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రజలకు– ప్రభుత్వానికి వారధిగా నిలబడి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. తెలంగాణ తొలి మెట్టు దినపత్రిక మరింత ఉన్నత స్థాయికి చేరుకుని, ప్రజల విశ్వాసాన్ని సదా నిలబెట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ విజయ్ కుమార్, నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్వాగత్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించిన చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**భారతీయ వెలుగు కాజీపేట, ఫిబ్రవరి 27**





కాజీపేట మండలం 47వ డివిజన్ డిజిల్ కాలనీ చౌరస్తాలో స్వాగత్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఓపెనింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆయిల్ సేల్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక 47వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్ మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రపు కోటేశ్వర్ గంగుల శ్రీనివాస్ రెడ్డి కటుకూరి రమేష్ రావుల విద్యాసాగర్ కాసర్ల నాగేష్ ఇమ్మడి బాబు గంగుల రాజి రెడ్డి సత్యవరం మధుకర్, అశోక్, సురేందర్, ఇమ్మడి నాగరాజు, దేవర రమేష్, రడపాక కిషన్, రాజు, రవి, వాస్కుల శీను, మాచర్ల శేఖర్, అర్జున్, జార్జి యాసీన్, చిన్న, జావిద్, అక్షయ్, మాస్, రాజు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు జంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన చాటిన సీఐ మచ్చ శివకుమార్

**భారతీయ వెలుగు వరంగల్, ఫిబ్రవరి 27**



హనుమకొండ విధి నిర్వహణలో కఠినత్వంతో పాటు మానవత్వం కూడా కలగలిసిన అరుదైన ఉదాహరణగా హనుమకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ నిలిచారు. ఒక కేసు సంబంధంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో, సతమతమవుతున్నట్లు గమనించిన సీఐ మచ్చ శివకుమార్, వారి పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్న ఆయన,తన వ్యక్తిగత వనరుల ద్వారా ఆర్థిక సహాయం అందించారు. అనుకోని సమయంలో అందిన ఈ సహాయంతో కుటుంబ సభ్యులు ఉపశమనం పొందుతూ సీఐకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. పోలీసులు కేవలం చట్ట పరిరక్షకులే కాకుండా సమాజంలో మానవీయ విలువలను కాపాడే వ్యక్తులుగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు.సీఐ మచ్చ శివకుమార్ చేసిన ఈ మానవీయ చర్యపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయభాను చిబ్ ని బేషరతుగా విడుదల చేయాలి

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో.. నిరసన

**భారతీయ వెలుగు హనుమకొండ, ఫిబ్రవరి 27**



తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపుమేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కార్తీక్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటం దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయభాను చిబ్ ని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడం సిగ్గుచేటు నరేంద్ర మోడీ చేస్తున్నటువంటి అక్రమాలను ఎండగడుతూ విద్యార్థి నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయంపై పోరాడుతున్న యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయభానుని బేషరతుగా విడుదల చేయాలని దేశంలో ఉన్న యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారన్నారు. విడుదల చేయకపోతే దేశవ్యాప్తంగా ఉన్న బిజెపి కార్యాలయాలు బిజెపి పార్టీ పార్లమెంట్ సభ్యులు ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. తక్షణమే విడుదల చేసి యువజన కాంగ్రెస్ కు ప్రధానమంత్రి బహిరంగ క్షమాపణ కోరాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌరం రాహుల్ వర్ధన్ డివిజన్ నాయకులు జూని ఆజాద్ సింగ్ వినయ్ కుమార్ వివేక్ మరియు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు గాద వివేక్ లక్కీ ఖుర్షీద్ హరి సింగ్ అప్సర్ దామెర మింటూ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రవేశపెట్టిన అనాథ వితంతువులు-ఒంటరి మహిళల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

- హర్షం వ్యక్తం చేసిన ఓరుగల్లు ప్రజలు, మహిళా మణులు

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 27**



గత పార్లమెంట్ సమావేశాల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య ప్రవేశపెట్టిన అనాథ వితంతువులు, ఒంటరి మహిళల (రక్షణ, పునరావాసం, సంక్షేమం) బిల్లు -- 2025" కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఈ బిల్లు అంశంపై భారత రాష్ట్రపతి పూర్తి సమాచారం పొందిన అనంతరం, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 117(3) ప్రకారం లోక్‌సభలో ఈ బిల్లును పరిశీలించేందుకు సిఫార్సు చేసినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి గారు లోక్‌సభ ప్రధాన కార్యదర్శికి పంపిన లేఖ ద్వారా తెలియజేశారు. గతేడాది డిసెంబర్ 6న పార్లమెంట్‌లో మహిళల సంక్షేమం, గౌరవం, భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో రెండు ప్రైవేట్ మెంబర్స్ బిల్లులను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆ ఘనత సాధించిన తొలి మహిళా ఎంపీగా డా.కడియం కావ్య గుర్తింపు పొందారు. తాను ప్రవేశపెట్టిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించడం పట్ల వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య హర్షం వ్యక్తం చేస్తూ, అనాథ వితంతువులు, ఒంటరి మహిళల రక్షణ, పునరావాసం, సంక్షేమం కోసం ఈ బిల్లు కీలకంగా మారుతుందని స్పష్టం చేశారు. ఈ బిల్లు కేవలం చట్టపరమైన ఆమోదంతోనే ఆగిపోకుండా, కార్యరూపం దాల్చి, అనాథ వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రత్యక్షంగా హక్కులు, భద్రత, సంక్షేమ ఫలాలు అందే వరకూ తాను నిరంతర పోరాటం చేస్తానని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య







**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 27**

వరంగల్ నగరంలో నిర్మాణంలో ఉన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సత్య శారద గారితో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి పనులపై ఎంజీఎం సూపరింటెండెంట్, ఎల్ ఢ టీ అధికారులు, ఆర్ ఢ బీ, విద్యుత్ శాఖ, జీడబ్ల్యూఎంసీ, ఫైర్ శాఖ అధికారులతో ఎంపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి నిర్మాణ పురోగతిని అధికారులు ఎంపీకి వివరించారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మిస్తున్నారని తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేసి, ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని, రోగులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఉత్తర తెలంగాణ ప్రజల వైద్య అవసరాల కోసం నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ త్వరలోనే అందుబాటులోకి రానుందని తెలిపారు. ఉత్తర తెలంగాణకు తలమానికంగా నిలిచే ఈ ఆసుపత్రి ద్వారా వరంగల్‌తో పాటు పలు జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. త్వరలోనే ఓపీ, ఐపీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఆసుపత్రికి సరిపడ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది సేవలందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వయంగా 24 అంతస్తుల భవనంలోని అన్ని ఫ్లోర్‌లలో తిరిగి జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రధానంగా ఎమర్జెన్సీ సేవలు, 16 అంతస్తుల్లో ఏర్పాటు చేస్తున్న బెడ్లకు ఆక్సిజన్ లైన్లు, ఫైర్ సేఫ్టీ వ్యవస్థ, సెంట్రల్ ఏసీ లైన్, విద్యుత్ సరఫరా, నీటి పైప్‌లైన్ కనెక్షన్లు, క్యాన్సర్ విభాగానికి రేడియేషన్ థెరపీ కోసం ప్రత్యేక బంకర్లు, ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ సేవలు, ఆడిటోరియం, ఆపరేషన్ థియేటర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తిస్థాయిలో ప్రారంభమైతే ఉత్తర తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ స్థాయి వైద్య సేవలు వరంగల్‌లోనే అందుబాటులోకి రానున్నాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబి ఎస్ ఈ రాఘవరెడ్డి, ఆర్ ఢ బి ఈ ఈ రాజేందర్, ఎల్ అండ్ టి ప్రాజెక్టు మేనేజర్ శ్రవణ్ కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్ చంద్రారెడ్డి, ఆర్ ఎం ఓ అశ్విన్ కుమార్, జిల్లా ఫైర్ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ – ఎస్ ఈ గీతం రెడ్డి, ఆర్ ఢ బి ఈ ఈ ఎలక్ట్రికల్ నర్సయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మున్సిపల్ కార్పొరేషన్ రవికుమార్, ఎమ్మార్వో శ్రీకాంత్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించండి

- ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ను క్షేత్రస్థాయిలో సందర్శన...
- హన్మకొండ జిల్లా కలెక్టర్/ జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్





**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 27**


వేసవి కాలం లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ధర్మసాగర్ లో గల 60 ఎం.ఎల్.డి , 20 ఎం ఎల్ డి నీటి శుద్ధీకరణ కేంద్రాలలో పర్యటించి వరంగల్ మహా నగరానికి మరియు హన్మకొండ జిల్లాలోని గ్రామీణ ఆవాసాలకు తాగునీరు సరఫరా చేసే తీరును పరిశీలించి నిర్వహణ తీరును ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని సమర్ధవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా రా వాటర్ లభ్యత ను గురించి అధికారులను అడుగగా 7.9 టి ఎం సి ల నీరు ఎల్ ఎండి కరీంనగర్ నుండి అందుబాటులో ఉందని, సహజం గా 1 టి ఎం సి నీటి నిల్వలు అందుబాటులో ఉంటే కనీసం 3 నెలల పాటు నగర అవసరాలకు సరిపోతాయని, రిజర్వాయర్ లో గల వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ ను పరిశీలించిన కలెక్టర్ నగర పరిధి లో పునరుద్ధరించడానికి గల అవకాశాలను పరిశీలించాలని జిడబ్ల్యుఎంసి ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. ఇరిగేషన్ ఫేజ్ 3 లో భాగం గా దేవాదుల నుండి ధర్మసాగర్ వచ్చే నీటి సరఫరా తీరును పరిశీలించి అక్కడి నుండి చేరే నీటి పరిమాణాన్ని అడిగి తెలుసుకున్నారు. నగరం లో గల ఫిల్టర్ బెడ్ లలో తాగునీటి సామర్ధ్యం, రోజు పంపింగ్ అవుతున్న నీటి పరిమాణం, శుద్దీకరణ జరుగుతున్న రా వాటర్ తో పాటు నీటి సరఫరా జరుగుతున్న పద్ధతి అడిగి తెలుసుకొని నీటి నాణ్యత ను నిర్ధారించే విధానాలను పరిశీలించి ల్యాబ్ లో ప్రత్యక్షం గా పర్యటించి నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ రామాంజనేయులు, ఎన్ ఐ టి మాజీ ప్రొఫెసర్ డా.పాండురంగారావు ఇరిగేషన్ ఈ ఈ మంగీ లాల్ బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యాయులకు జీతాలు ఎక్కువ కాదు! చాలా తక్కువే !

» విద్య వైద్య రంగంలో మార్పులు అవసరం
» పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర నేత ఆర్కే వెంకటేష్

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 27**



కాజీపేట మండలం ఎంపీపీఎస్ అయోధ్య పురం సందర్శించిన పి ఆర్ టి యు తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రావుల కార్ వెంకటేష్ ఆహ్వానించిన పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర నేత మన్నె చంద్రన్న. ఇటీవల తొలిసారి ఎన్నికైన వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు తీసుకున్న ఆర్కే కు శుభాకాంక్షలు తెలియజేసి సుమారు 2 గంటపాటు ఉపాధ్యాయుల సమస్యలపై దీర్ఘకాలికంగా ఆర్కే వెంకట్ చర్చ జరిపారు. శుక్ర వారం వివిధ వార్తాపత్రికలలో వచ్చిన "ఉపాధ్యాయుల జీతాలు ఎక్కువ "అనే అంశంపై , విద్యా కమిషన్ రిపోర్ట్ పై అసహనం వ్యక్తం చేశారు. ఇది శాస్త్రీయమైన అంశం కాదని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు అతి తక్కువ జీతాలతో కాలం వెలదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిఏ ఆక్ట్ చట్టం ప్రకారం వివిధ రాష్ట్రాలలో ఉపాధ్యాయుల,ఉద్యోగుల జీతాల పై రిపోర్టు తెచ్చుకొని పరిశీలిస్తే తేట తెల్లమవుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం ఐదు డిఏలు బాకీ ఉండగా,పిఆర్సి రిపోర్టుపై అలసత్వం చేస్తుందని, ఉద్యోగుల పిఆర్సి కమిషన్ రిపోర్టు పూర్తయి రెండేళ్లు గడిచినప్పటికీ చర్యలు గైకొనక పోవడం శోచనీయం అని, ఉద్యోగుల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది అన్నారు. పెండింగ్ బిల్లులపై స్పష్టత లేదన్నారు. అంతేకాకుండా ఉద్యోగుల, ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక తీవ్ర ఇబ్బందులు పడి రాష్ట్రంలో సుమారు 70 మంది పెన్షనర్స్ చనిపోయారు. ఈ విషయం అసెంబ్లీలో ప్రతిపక్షాలు చర్చ జరిపారని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలుసునన్న విషయాన్నికూడా గుర్తు చేశారు. ప్రజాపాలనలో భాగంగా.., ఉద్యోగుల పై ప్రభుత్వం ఇచ్చిన హామీల మూటలు విప్పాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఉద్యోగులకు అండగా నిలవాల్సిన పరిస్థితిలో చేతులెత్తేయడం ఆక్షేపనీయమన్నారు. సరియైన టైంలో ఉద్యోగులకు ఉపాధ్యాయులకు నగదురహిత వైద్యం అందించాల్సిన పరిస్థితులలో చేతులెత్తేయడం సరికాదన్నారు.ప్రజా సంక్షేమంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలను కూడా కాపాడాలన్నారు.విద్య రంగంపై విప్లవాత్మక మార్పులు తెచ్చింది రేవంత్ ప్రభుత్వమే అని హర్షం వ్యక్తంచేశారు. విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో పాటు ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగితే సహించేది లేదన్నారు. విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఉపాధ్యాయులను తక్కువ చేసి మాట్లాడడం సరికాదన్నారు.తాను కూడా ఒక గురువు వల్లనే ఐఏఎస్ ఆఫీసర్ అయ్యారన్న విషయం గుర్తుకు తెచ్చుకోవాలన్నారు.ఉపాధ్యా యుల న్యాయపరమైన హక్కులకు భంగం వాటిల్లితే తెలంగాణ ఉద్యమం తలపించే తరహాలో నిర్వహిస్తామని ప్రభుత్వం దిగి వచ్చి ఉద్యోగుల రాజ్యాంగబద్ధమైన సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
శనివారం ఫిబ్రవరి 28, 2026

# జిల్లాలో ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

» జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 27**
జిల్లాలో ఆహార భద్రత చట్టం సమర్ధవంతంగా అమలు కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలకు బియ్యం పంపిణీ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాన్ని కలెక్టర్ ఆరా తీశారు. మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్మెంట్ సిబ్బంది వివరాలు, పీడీఎస్ బియ్యం పంపిణీలో అక్రమాలపై నమోదైన కేసుల స్థితిగతులను జిల్లా పౌర సరఫరాల అధికారి ఎండి. వాజిద్ అలీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం డీలర్ల నియామకానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. పాత బియ్యం నిల్వల (ఓల్డ్ స్టాక్) వివరాలను సమగ్రంగా సేకరించాలని సూచించారు. వర్షాల కారణంగా హాస్టళ్లు, పాఠశాలల్లో ఎక్కడైనా బియ్యం దెబ్బతిన్నట్లయితే, వెంటనే ప్రత్యామ్నాయంగా నూతన బియ్యం సరఫరా చేయాలని, సంబంధిత వివరాలను జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్‌కు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎండి. వాజిద్ అలీ, జెడ్పీ సీఈవో శేషాద్రి, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, డిఆర్డిఓ మేన శ్రీను, డీఈఓ గిరిరాజు గౌడ్, ఎన్జీవో ప్రతినిధి డాక్టర్ అనితా రెడ్డి, జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. 14

# అభివృద్ధి పథంలో కాజీపేట సోమిడి 62వ డివిజన్

» అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

**భారతీయ వెలుగు కాజీపేట, ఫిబ్రవరి 27**



కాజీపేట పట్టణంలోని 62వ డివిజన్ పరిధిలో రూ. 2 కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా, ఇకముందు కూడా అభివృద్ధిలో ముందుండి ప్రజల నాయకుడిగా సేవలందిస్తున్న మన ప్రియతమ నాయకుడు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నాయకత్వంలో హనుమకొండ జిల్లా అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరిస్తూ ప్రజాసేవలో అంకితభావంతో ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్, డిసిసి ప్రెసిడెంట్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు.

# శోభాయమానం.. శ్యామ్ నిషాన్ యాత్ర

**భారతీయ వెలుగు హైదరాబాద్, ఫిబ్రవరి 27**
రాధేశ్యామ్ నామస్మరణలు మార్మోగాయి. రంగురంగుల జెండాలతో సాగిన నిషాన్ యాత్రతో కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని శ్యామ్బాబా మందిర్ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కలియుగ కృష్ణుడిగా భావించే శ్యామ్ బాబా తన శిరస్సును శ్రీ కృష్ణుడికి దానమిచ్చిన రోజును పురస్కరించుకుని నిర్వహించే పాల్గున్ మహోత్సవం శుక్రవారం శ్యామ్ మందిర్ లో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్యామ్ మందిర్ లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశామహల్ నుంచి కాచిగూడ శ్యామ్ మందిర్ వరకు భక్తులు



ప్రత్యేక శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఆర్. లక్ష్మణ్ రావు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాచిగూడ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక



వేదిక నుంచి భక్తులకు ఆయన స్వాగతం పలికారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు రంగు రంగుల జెండాలతో నిషాన్ శోభాయాత్రలు నిర్వహించారు. గుర్రాలు, ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనాలతో యాత్రలో పాల్గొన్నారు. రథాలపై శ్రీకృష్ణుడి చిత్రపటాలుంచి ఊరేగించారు. ఈ ఊరేగింపునకు శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ దకోటియా, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, రాందేవ్ అగర్వాల్, కృష్ణకుమార్ బడేగావ్వాలే, రాజ్కుమార్ విగ్, కపిల్ అగర్వాల్ తదితరులు స్వాగత వేదిక నుంచి ఘన స్వాగతం పలికారు. విజయ్, లాలు, చింటు, ఇషాన్, ఆనంద్, కేశవ్, విషాల్ రవి, కిరణ్, శ్యామ్, హిమాన్షు, క్రిష్ణ, రాహుల్, శ్రావణ్, పవన్, తన్వీ, తదితర భక్తులు పాల్గొని శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించారు. శ్యామ్ బాబా కు 56 రకాల మిఠాయిల నైవేద్యాన్ని సమర్పించారు. అలాగే బాబా విగ్రహాన్ని రకరకాల పూలు, పట్లతో అలంకరించారు. 9

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నీల నాగరాజు ఎన్నిక

» కుమార్ యాదవ్, జిల్లా ఇంచార్జ్


(T.S. Regd)
తెలంగాణ ఉద్యమకారులఫోరం
తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం
రాష్ట్ర కమిటీ
సెల్ : 7702877493, 9347237778

27 -02-2026

నియామక పత్రం

శ్రీ నీల నాగరాజు గారిని
తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్
రాష్ట్ర కార్య దర్శి గా
నియమిస్తూ ప్రకటిస్తున్నాం.
ఉద్యమ కారుల ను
ఐక్యం చేస్తూ తెలంగాణ ఉద్యమ కారుల
ఆత్మ గౌరవం
సంక్షేమం కోసం కృషి చేయాలని కోరుతున్నాం.

Dr చీమ శ్రీనివాస్
చైర్మన్
తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్




**భారతీయ వెలుగు బ్యూరో, ఫిబ్రవరి 27**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా వీణవంక మండల కేంద్రానికి చెందిన నీల నాగరాజును నియమించారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నీల నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర పరిధిలోని అన్ని జిల్లాలు, మండలాల్లో వారం రోజుల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు అయ్యే వరకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌కు, అలాగే తెలంగాణ ఉద్యమకారులందరికీ నీల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# హైకోర్టులో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులపై విచారణ

» 30 ఏప్రిల్ 2026 వరకు గడువు పొడిగింపు

**భారతీయ వెలుగు ఫిబ్రవరి, 27**
తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్ కార్డుల నిబంధనల మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌లో, జీఓ 252, సవరించిన జీఓ 103 వల్ల జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సదుపాయాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఫెడరేషన్ పేర్కొంది. పిటిషనర్ తరఫున ప్రముఖ న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్



జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అలాగే, జీఓ 252, సవరించిన జీఓ 103 పై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రభుత్వం పూర్తి స్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, సౌకర్యాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని, పేర్కొంది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ ముహియుద్దీన్ అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడగింపును స్వాగతిస్తూ, ఇది తాత్కాలిక ఊరట మాత్రమేనని, జర్నలిస్టులకు న్యాయం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# కవితక్కకు ఢిల్లీ లిక్కర్స్ క్యాంప్ కేసులో క్లీన్ రావడం సంతోషంగా ఉంది

» రాకేష్ గైక్వాడ్



**భారతీయ వెలుగు హైదరాబాద్, ఫిబ్రవరి 27**
ఢిల్లీ లిక్కర్ కేసులో క్లీన్ చీట్ రావడం సంతోషంగా ఉందని హరి బోలీ డివిజన్ తెలంగాణ జాగృతి యువ నాయకులు రాకేష్ గైక్వాడ్ అన్నారు. న్యాయవ్యవస్థపై నమ్మకం పెట్టుకున్న నమ్మకమే గెలిపించిందని, కడిగిన ముత్యంలా బయటికి వస్తానని కవితక్క చెప్పిన విధంగానే క్లీన్ చీట్ రావడం ఎంతో సంతోషంగా ఉందని రాజకీయ కక్ష సాధింపులతో కేసులు పెట్టారని గతంలో పదేపదే కవితక్క తెలిపిన ఎంతోమంది విమర్శలు చేసిన పట్టించుకోలేదని, ఐదున్నర నెలలు జైల్లో పెట్టిన కుటుంబానికి దూరం చేసిన, తెలంగాణ ప్రజలకై పట్టు విడవకుండా ప్రజల పక్షాన నిలబడుతూ ప్రజా గొంతుకై ప్రశ్నిస్తున్న కవితక్కకు తెలంగాణ జనం నీరాజనం పడుతున్నారని, కవితక్కను విమర్శించిన నోర్లు ఇప్పుడు మూతపడతాయని ఈ సందర్భంగా రాకేష్ గైక్వాడ్ అన్నారు. కవితకు క్లీన్ చిట్ రావడంతో తెలంగాణ జాగృతి ఆఫీస్ వద్ద బాణా బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టి, రంగులు చల్లుకొని కవితక్క జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, నవీన్ కుమార్, హర్ష, ఓంకార్, శ్రీకర్ రాజు, బబ్లు, నితిన్, భాను, సతీష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ రాకెట్ ట్రయల్ రన్ విజయవంతం

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 27**
భద్రకాళి బండు వద్ద మోడల్ రాకెట్ ట్రయల్ రన్ శుక్రవారం విజయవంతంగా ప్రయోగించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మోడల్ రాకెట్ లాంచింగ్ ట్రయల్ రన్ కోసం ఏర్పాట్లు చేయగా భద్రకాళి చెరువులోని ఐలాండ్ వద్ద నమూనా రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. మోడల్ రాకెట్ రూపకర్త శశాంక్ భూపతి ట్రయల్ రన్ ను విజయవంతంగా ప్రయోగించారు. ఈ




సందర్భంగా వరంగల్ ఎన్ఐటి ప్రొఫెసర్ అంజన్ కుమార్, ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఫౌండర్ సెక్రెటరీ డైరెక్టర్ ఎన్. రఘునందన్ కుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ బీమ్ రావు, సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, హనుమకొండ ఏసిపి నరసింహారావు, తదితరుల సమక్షంలో రాకెట్ లాంచింగ్ ట్రయల్ రన్ చేపట్టారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా ఈ నెల 28 ( శనివారం) సాయంత్రం ఐదున్నర గంటలకు మోడల్ రాకెట్ ను భద్రకాళి బండ్ నుండి ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగంతో చారిత్రక వరంగల్ నగరం సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. అదేవిధంగా శనివారం హనుమకొండ కాళోజి కళాక్షేత్రంలో మధ్యాహ్నం 2:30 నుండి 4 గంటల వరకు నిర్వహించే సెమినార్ లో అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించిన వివిధ అంశాలపై వక్తలు ప్రసంగించనున్నారు. ఇందుకు సంబంధించి సెమినార్ కు పరిమిత సంఖ్యలో అనుమతి కలదని అధికారులు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 27**



హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవత్ రెడ్డి ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ వైద్య రంగ అభివృద్ధికి సంబంధించి పలు ముఖ్య అంశాలపై చర్చించారు. ఇటీవల వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల మరియు ఎంజీఎం దవాఖానాల అభివృద్ధి కోసం ఆర్థిక సహాయం ప్రకటించిన ఎన్ఆర్ఐ వైద్యుడు డాక్టర్ సుజిత్ రెడ్డి పున్నం విషయాన్ని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే నాయిని వివరించారు. వైద్య సేవల మెరుగుదలకు, మౌలిక వసతుల విస్తరణకు, ఆధునిక పరికరాల సమకూర్పుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయని తెలిపారు. డాక్టర్ సుజిత్ రెడ్డి కేఎంసీ పూర్వ విద్యార్థి కావడంతో పాటు హనుమకొండ వాసి ,విదేశాల్లో స్థిరపడినప్పటికీ సొంత గడ్డపై మమకారం చాటుతూ వైద్య రంగానికి చేయూత అందించడం అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్వగ్రామ అభివృద్ధికి ముందుకు వచ్చే ఎన్ఆర్ఐలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజిత్ రెడ్డి ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మానించి అభినందించారు. వరంగల్ ప్రాంతంలో వైద్య సేవల స్థాయిని మరింత పెంచే దిశగా ప్రభుత్వం కూడా అవసరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, విష్ణు రెడ్డి, పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ కు వంద ఎలక్ట్రిక్ బస్సులు

» హనుమకొండ కలెక్టరేట్ లో ఆర్టీసీ,రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం

**భారతీయ వెలుగు హనుమకొండ, ఫిబ్రవరి, 27**
ప్రజా రవాణాలో భాగంగా గ్రేటర్ వరంగల్ నగరానికి ప్రభుత్వం వంద ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేసిందని, బస్సుల నిర్వహణ కోసం ప్రతిపాదిత స్థలాన్ని త్వరగా అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఆర్టీసీ,రెవెన్యూ శాఖల అధికారులతో ఎలక్ట్రిక్ బస్సుల



నిర్వహణ కోసం మడికొండలో ప్రతిపాదిత స్థలం,నిర్వహణ అంశాలకు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన వంద ఎలక్ట్రిక్ బస్సులు గ్రేటర్ వరంగల్ పరిధిలో నడుస్తాయన్నారు. మడికొండలో ప్రతిపాదిత ఐదెకరాల స్థలాన్ని ఆర్టీసీ,రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా హనుమకొండ చౌరస్తా బస్ బే అభివృద్ధి చేయడంపై ఆర్టీసీ,కుడా అధికారులతో ఈ సందర్భంగా చర్చించారు. కాజీపేటలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ అంశాలపై సమీక్షించారు.
ఈ సమావేశంలో డిప్యూటీ ఆర్ ఎం భాను కిరణ్,మధు,హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్,ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్, తహసీల్దార్ రాజు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

Publishers & Owner Gunnala lavanya PLOT NO 332/P, ROAD NO 13, KRUSHI NAGAR, MADINAGUDA, MIYAPUR, SERILINGAMPALLY, RANGAREDDY, TELANGANA-500049. RNI: TGTEL/26/A0320. Printers VASISTA PRINTERS, 18-97#306, 3rd loor, Rajini gandha Complex, kamala Nagar, Chaitanyapuri, Rangareddy, Telangana, 500060 Editor Gunnala Anilreddy Phone 9642844456, 9705043131